teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 302 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 14 మార్చి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల తాత్కాలిక బంద్

### హెూలీ పండుగ సందర్భంగా నగర పోలీసుల ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): గ్రీష్మకాలం సమీపిస్తున్న వేళ మద్యం ప్రియులకు ఊహించని షాక్. ఎండల వేడి నుండి కాస్త ఉపశమనం కోసం బీర్లు, మద్యం ఆశ్రయించే మందుబాబులకు, ఈ నెల 14వ తేదీ ప్రత్యేకంగా చేదు అనుభవం కలిగించనుంది. నగర

మిగతా 2 లో



హెూలీ సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు




.. వివరాలు 2లో

ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదల




.. వివరాలు 2లో

యోగా మహోత్సవ్ ను ప్రారంభించిన కేంద్ర ఆయుష్ మంత్రి




.. వివరాలు 2లో



# కొత్త రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

- స్మార్ట్ కార్డుల మాదిరి ఇచ్చుటకు సిద్ధం అవుతున్న సర్కార్
- రేషన్ కార్డుకు క్యూఆర్ కోడ్ పెట్టాలని అధికారుల నిర్ణయం
- డిజైన్లను పరిశీలిస్తోన్న ప్రభుత్వం



హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సర్కార్ జనవరి 26 నుంచి రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. లక్షల మంది అప్లయ్ చేసుకున్నప్పటికీ గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో కార్డులు పెండింగ్‌లో

మిగతా 2 లో

## రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో పెరుగనున్న ఎండలు

41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని సూచనలు

ఆరెంజ్ అలెర్ట్ జారీకి అవకాశం.. హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి



హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో రోజు రోజుకు ఎండలు పెరిగిపోతున్నాయి. రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఆరెంజ్ అలెర్ట్ జారీ అయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీలు ఎక్కువ నమోదైనట్లు పేర్కొంది. పగటి వేళ వేడిగాలుల ప్రభావం ఎక్కువ ఉంటున్నందున, వీలైనంత వరకు అవసరం ఉంటేనే బయట తిరగాలని వాతావరణ శాఖ

మిగతా 2 లో

## ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులు

### ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ






## విదేశీ వ్యవహారాల శాఖ మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి భేటి

### ప్రభుత్వం కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి

తెలంగాణ బ్యూరో, మార్చి 13 (తీన్మార్ న్యూస్): రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం

మిగతా 2 లో

## గ్రూప్ 1 అభ్యర్థులకు టీజీపీఎస్సీ అలెర్ట్

### తప్పుదోవపట్టించే సమాచారాన్ని నమ్మవద్దు




హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): గ్రూప్ 1 నియామకాలకు సంబంధించి తప్పుదోవపట్టించే సమాచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు టీజీపీఎస్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో జరిగిన ప్రచారంపై కమిషన్ సీరియస్‌గా

మిగతా 2 లో

## అంబేద్కర్ విగ్రహం వద్ద హైటెన్షన్ వాతావరణం

### ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్ నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన



హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేశారు. విరమించాలని పోలీసులు విజప్తి చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎంతకూ వినకపోవడంతో అదుపులోకి

## రాష్ట్ర రాజకీయాల్లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు

- కేసీఆర్, బీజేపీ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపాటు
- తమ పార్టీని బలవంతంగా విలీనం చేశారని ఆరోపనలు



హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో విజయశాంతి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నుంచి బయటకు వచ్చిన అనంతరం

మిగతా 2 లో

## మేం ఏ పథకాన్ని ఆపుతామని చెప్పడం లేదు

- పాతవి కొనసాగిస్తూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నాం
- బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): మేము ఏ పథకాన్ని ఆపుతున్నామని చెప్పడం లేదని, పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నామని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ

మిగతా 2 లో




## రాష్ట్రంలో 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల స్థానాలు ఏకగ్రీవం

### ఈ మేరకు ఎన్నికల అధికారులు అధికారిక ప్రకటన జారీ

### ఏకగ్రీవం అయిన ఎమ్మెల్సీలకు ధృవీకరణ పత్రాలు జారీ

తెలంగాణ బ్యూరో, మార్చి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో జరగనున్న 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ మేరకు ఎన్నికల అధికారులు అధికారిక ప్రకటన జారీ చేశారు. ఏకగ్రీవం అయిన ఎమ్మెల్సీలకు ధృవీకరణ పత్రాలు జారీ

మిగతా 2 లో



## గాత్రానికి పని చెప్పిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

### నరేంద్ర మోడీపై పాటలో బండి గానం


హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): రాజకీయాల్లో తన మాటలతో ప్రత్యర్థులపై విరుచుకుపడే కేంద్ర మంత్రి బండి సంజయ్ సింగర్ అవతారమెత్తారు. తాజాగా ఆయన తన గాత్రానికి పని

మిగతా 2 లో

# కొత్త రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయి. అయితే రేవంత్ సర్కార్ ప్రజావాణి, ప్రజాపాలన, కులగణన సర్వేతో పాటుగా మీ-సేవ సెంటర్ల ద్వారా కూడా దరఖాస్తులు తీసుకొని అర్హులకు కార్డులు మంజూరు చేసేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధమవుతోంది. అయితే కొత్తగా జారీ చేసే రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న మాదిరిగా కాకుండా స్మార్ట్ కార్డుల రూపంలో ఇచ్చేందుకు రెడీ అయింది. ప్రతి స్మార్ట్ రేషన్ కార్డుకు ఓ క్యూఆర్ కోడ్ పెట్టాలని అధికారులు నిర్ణయించారు. స్మార్ట్ కార్డు ఎలా ఉండాలన్న విషయంపై ఇప్పటికే వివిధ రకాల డిజైన్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ డిజైన్ల ప్రక్రియ కొద్దిరోజుల్లో కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కొత్తగా దాదాపు 20 లక్షల మంది రేషర్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. వారిలో అర్హులను ఎంపిక చేసి కొత్త కార్డులు ఇవ్వాల్సి ఉంది. చాలావరకు జిల్లాల్లో ఈ మేరకు వడపోత కూడా అయిపోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో మార్చి 1 నుంచి..



మిగిలిన జిల్లాల్లో మార్చి 8 నుంచే కొత్త రేషన్‌కార్డులు ప్రజలకు ఇవ్వనున్నారు. అయితే మునపటి కార్డుల్లా కాకుండా.. 'స్మార్ట్' కార్డు రూపంలో ఇస్తూ ఉండటంతో జారీ ప్రక్రియ లేటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాదు ఆల్రెడీ ఉన్న రేషన్ కార్డులను సైతం స్మార్ట్ కార్డులుగా మార్చనున్నారు. ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. బిడ్స్ దాఖలుకు మార్చి 25వ తేదీ వరకు ఫైనల్ డేట్ ఇచ్చారు. కొత్త కార్డులతో పాటుగా.. ఇప్పటికే రేషన్‌కార్డు ఉన్నవారికి సైతం క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు సివిల్ సప్లయ్ శాఖ ఇప్పటికే టెండర్లు పిలిచింది. బిడ్స్ దాఖలుకు మార్చి 25వ తేదీ వరకు తుది గడువు ఇచ్చారు. మహిళల ఫొటోతోనే కార్డులు జారీ చేయనున్నట్లు సమాచారం.

## రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో పెరుగనున్న ఎండలు

మొదటి పేజీ తరువాయి

సూచించింది. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా క్యాప్ వంటివి ధరించాలని నిపుణులు సూచిస్తున్నారు. శరీరం డీ హైడ్రేడ్ అవకుండా చూసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాల వివరాలు

**ప్రాంతం.. నమోదైన ఉష్ణోగ్రత**

ఆదిలాబాద్ 37.8
భద్రాచలం 38
హకీంపేట్ 38.8
దుండిగల్ 38
హన్మకొండ 37
హైదరాబాద్ 36.9
ఖమ్మం 37.4
మహబూబ్ నగర్ 38.8
నల్గొండ 34.5
నిజామాబాద్ 38.9
రామగుండం 37.8
పటాన్చెరు 36.2
రాజేంద్రనగర్ 37
హయత్ నగర్ 36



## గాత్రానికి పని చెప్పిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. ఓ రికార్డు స్టూడియోలో మైక్ అందుకుని నరేంద్ర మోడీపై దాదాపు పాట పాడారు. ఏడాది క్రితం రిలీజ్ అయిన నమో.. నమో.. నరేంద్ర మోడీ' పాటను హుషారుగా పాడారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను బీజేపీ శ్రేణులు, బండి సంజయ్ అభిమానులు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. దీంతో ఈవీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. అయితే ఇది పాత వీడియో అని ఎన్నికలకు ముందు పాడారని కొంత మంది నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కాగా బండి సంజయ్ తన సింగర్ అవతారం ఎత్తడం ఇదే కొత్త కాదు. తాను కేంద్ర మంత్రి అయ్యాక సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమలో పాల్గొన్న ఆయన తన అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఈ భూమి బిడ్డలం హిందువుల మందరం.. అనే పాటను పాడి వినిపించి అందరిని ఆకట్టుకున్నారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద హైటెన్షన్ వాతావరణం

మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో హరీష్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డి, కోవా లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డి సహా పలువురు ఉన్నారు. కాగా, అంతకుముందు అసెంబ్లీలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మేము కూడా ప్రజలు ఎన్నుకుంటేనే సభలోకి వచ్చాం. మీరు మేము ఎన్నుకుంటేనే స్పీకర్ అయ్యారు. ఈ సభ మీ సొంతమేం కాదు అని స్పీకర్‌ను ఉద్దేశించి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దీంతో రగడ స్టార్ట్ అయ్యింది. క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేసినా జగదీష్ రెడ్డి తగ్గలేదు. దీంతో సభ్యుల డిమాండ్ మేరకు జగదీష్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు.

## రాష్ట్రంలో 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల స్థానాలు ఏకగ్రీవం

మొదటి పేజీ తరువాయి

చేశారు. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా విజయశాంతి, దాసోజు శ్రవణ్, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సత్యం నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు మరో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా నామినేషన్లు సరిగా దాఖలు చేయని కారణంగా అవి తిరస్కరించబడ్డాయి. దీంతో ఈ ఐదుగురు ఏకగ్రీవం అయ్యారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా కాంగ్రెస్ కు 4 స్థానాలు రాగా వాటిలో ఒకటి పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించింది. ఫలితంగా కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ లు. సీపీఐ నుంచి సత్యం నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ కు ఒక స్థానం రాగా ఆ పార్టీ నుంచి దాసోజు శ్రావణ నామినేషన్ దాఖలు చేశారు. కాగా వీరంతా ఏకగ్రీవం అయినట్టు ఈసీ ప్రకటించింది.

## విదేశీ వ్యవహారాల శాఖ మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి భేటి

మొదటి పేజీ తరువాయి

జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో గురువారం ఆయనను ముఖ్యమంత్రి కలిశారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జైశంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమైన హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వ శాఖ మద్దతుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జైశంకర్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



## గ్రూప్ 1 అభ్యర్థులకు టీజీపీఎస్సీ అలెర్ట్

మొదటి పేజీ తరువాయి

స్పందించింది. కొంతమంది స్వార్థపరులు తమ ప్రయోజనాలకు అనుగుణంగా సమాచారాన్ని విశ్లేషిస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని మండిపడింది. ఇది గ్రూప్1 అభ్యర్థులలో గందరగోళాన్ని సృష్టిస్తుందని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రతిభావంతులైన అభ్యర్థులను కమిషన్ తన నియమ నిబంధనలకు లోబడి ఎంపిక చేస్తుందని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా మధ్య వర్తులు తప్పుడు వాగ్దానాలు చేస్తే వారిపై అభ్యర్థులు వెంటనే సంబంధిత ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపింది. కమిషన్ పారదర్శకంగా నియామకాలు చేపడుతుందని, మధ్యవర్తులు తప్పుడు వాగ్దానాలు, హామీలు ఇచ్చినట్లు ఇప్పటివరకు ఒక్క ఫిర్యాదు రాలేదని తెలిపింది. ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 మెయిన్స్ మార్కులకు సంబంధించి కొంతమంది వ్యక్తులు, సంస్థలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని టీజీపీఎస్సీ అసహనం వ్యక్తం చేసింది. అదే సమయంలో గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షను గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిందని, సమాధాన పత్రాల మూల్యాంకనం అదే సంవత్సరం నవంబర్ 1 న ప్రారంభమై 31 తో పూర్తయిందని తెలిపింది. తెలంగాణ రాష్ట్రానికి సేవ చేయడానికి ఉత్తమ ప్రతిభ చూపిన అభ్యర్థులను ఎంపిక చేయడమే రిక్రూట్‌మెంట్ ఏజెన్సీగా కమిషన్ లక్ష్యమని పేర్కొంది. అభ్యర్థుల సబ్జెక్టుల వారీగా మార్కులను వారి లాగిన్‌లో కమిషన్ ఉంచినట్లు తెలిపింది.


**100, 500 ర్యాంకుల వరకు వివరాలు:**

రిజర్వేషన్ రోస్టర్ల ప్రకారం నోటిఫై చేసిన ఖాళీల ఆధారంగా అభ్యర్థులను మెరిట్ జాబితా నుంచి ఎంపిక చేస్తారని తెలిపింది. ఆర్డీఓ, డీఎస్పీ, సీటీఓ లాంటి ప్రతి కేటగిరీ పోస్టులలో నోటిఫికేషన్ ప్రకారం రిజర్వ్ చేయని, రిజర్వ్ చేయబడిన కేటగిరి అభ్యర్థులు రిక్రూట్ మెంట్ అవుతారని తెలిపింది. మొదటి వంద ర్యాంకుల్లో అభ్యర్థుల వివరాలను బట్టి చూస్తే పురుషులు 59 మంది, మహిళలు 41 మంది, అలాగే కమ్యూనిటీ ప్రకారం ఓసీలు 32, బీసీలు 48, ఎస్సీలు 3, ఎస్టీలు 5, ఓసీ ఈడబ్ల్యూఎస్ 12 మంది ఉన్నారని టీజీపీఎస్సీ తెలిపింది. అలాగే మొదటి 500 ర్యాంకుల వారిగా చూస్తే పురుషులు 296, మహిళలు 204, కమ్యూనిటీల వారిగా చూస్తే ఓసీలు 132, బీసీలు 228, ఎస్సీలు 50, ఎస్టీలు 38, ఓసీ ఈడబ్ల్యూఎస్ 52 మంది ఉన్నట్లు పేర్కొంది.

## రాష్ట్ర రాజకీయాల్లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఆమె బీఆర్ఎస్‌పై, కేసీఆర్‌పై, అలాగే బీజేపీ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తమ పార్టీని బలవంతంగా విలీనం చేశారని ఆమె ఆరోపించారు. విజయశాంతి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో తాను కేసీఆర్ కంటే ముందే క్రియాశీలంగా పాల్గొన్నానని, తెలంగాణ రాష్ట్రం కేసీఆర్‌కు సొంతం కాదని స్పష్టం చేశారు. నా పార్టీని బలవంతంగా విలీనం చేశారు. తెలంగాణ కోసం నేను పోరాడిన ఫలితం ఇదేనా? నిజాలు మాట్లాడండి, అని ఆమె వ్యాఖ్యానించారు. ఒక ఓటుతో రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉంటుందన్న వాగ్దానాన్ని బీజేపీ తప్పించుకుందని, ఆ కారణంగా తాను ఆ పార్టీని వీడానని విజయశాంతి స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన శక్తులను బీజేపీ రాష్ట్రంలోకి రప్పిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, అని ఆమె హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ తనపై అనవసర విమర్శలు చేస్తున్నారని విజయశాంతి మండిపడ్డారు. ఎందుకు అంత కుట్రబుద్ధి? దొరబుద్ధి చూపిస్తున్నారు. బడుగుల బలహీన వర్గాలను చూడకుండా, తెలంగాణను కార్పొరేట్ లబ్ధిదారులకు అంకితం చేశారు, అంటూ కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణను ఉద్యమకారుడి చేతిలో పెట్టిన ప్రజలు ఇప్పుడు ఆర్థికంగా రాష్ట్రాన్ని ఎలా నష్టపరిచారో చూస్తున్నారని ఆమె అన్నారు. ఏం చేశావో చెప్పు. చేసిన తప్పులు ఒప్పుకో. కేసీఆర్‌ను వదిలిపెట్టకూడదు. లక్షలాది ప్రజల ఆశయాలను మోసం చేసి లక్షల కోట్ల రూపాయలు సంపాదించాడు. ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసింది ఎవరు? అంటూ విజయశాంతి ఘాటుగా ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడటమే తన ధ్యేయమని విజయశాంతి స్పష్టం చేశారు. భవిష్యత్తులో రాజకీయ పరంగా మరింత దూకుడుగా వ్యవహరించనున్నట్లు ఆమె సంకేతాలు ఇచ్చారు.



## మేం ఏ పథకాన్ని ఆపుతామని చెప్పడం లేదు

మొదటి పేజీ తరువాయి



అసెంబ్లీ సమావేశాల్లో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను ట్విట్టర్లో పోస్ట్ చేశారు. దీనిపై ఆయన.. అప్పులు ఉన్నాయని తెలుసి ఆర్థిక వ్యవస్థీకరణ చేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీకి ఇవన్నీ పరిపాలించే అనుభవం ఉందని చెప్పారు. ఇన్ని కార్యక్రమాలు జరిగే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం పెద్దన్న లాగా రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం ఉండాలి కానీ ప్రభుత్వం మీదనే దుష్ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అలాగే గత పాలకులు అందమైన భవనాలు కట్టి తెలంగాణ ఆర్థికంగా గొప్పగా ఉందని చూపే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తాము ఎక్కడా తప్పించుకునే ప్రయత్నం చేస్తలేమని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇక బీజేపీ నాయకులు మాట్లాడితే తులం బంగారం గురించి మాట్లాడుతున్నారని, 15 లక్షల రూపాయలు ఇచ్చారా.. రైతులకు పెన్షన్ ఇస్తామన్నారు.. రైతులకు ఉరి చట్టాలు తెచ్చారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేగాక బీజేపీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు ఎన్ని ఇచ్చారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చే నిధులు కూడా వాపసు ఇచ్చే పరిస్థితి లేదు కానీ బాత్రూం మీద ఫోటో పెట్టాలని రేషన్ షాపు లో మీద ఫోటోలు పెట్టాలని అంటున్నారని దుయ్యబట్టారు. ఇక నిర్మల్ నియోజకవర్గంలో 23,906 మంది రైతులకు 202.55 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశామని వివరించారు. రెండు లక్షల లోపు వరకు రైతు రుణమాఫీ చేశామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఒక్క నిర్మల్ నియోజకవర్గానికి 202 కోట్ల రూపాయలు రైతు రుణమాఫీ చేసిందని, దీని మీద చర్చ చేయడానికి నిర్మల్ కి రావడానికైనా సిద్ధంగా ఉన్నామని మంత్రి ఛాలెంజ్ చేశారు.

## హెూలీ సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు



న్యూ ఢిల్లీ, మార్చి 13 (తీన్మార్ న్యూస్): హెూలీ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి తన సందేశంలో, హెూలీ, రంగుల పండుగ ఆనందం మరియు ఉత్సాహాన్ని తెస్తుంది అని అన్నారు. ఈ పండుగ మన జీవితాల్లో ఐక్యత మరియు సోదరభావ స్ఫూర్తిని పెంపొందిస్తుంది మరియు హెూలీ యొక్క విభిన్న రంగులు భిన్నత్వంలో ఏకత్వం యొక్క విలువలను ప్రతిబింబిస్తాయి" అని ఆమె అన్నారు. ఈ పండుగ చెడుపై మంచి విజయాన్ని సూచిస్తుందని మరియు ఇది ప్రేమ మరియు సానుకూలతను వ్యాప్తి చేయడానికి మనకు నేర్పుతుందని రాష్ట్రపతి అన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ దేశ ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉపరాష్ట్రపతి తన సందేశంలో, హెూలీ చెడుపై మంచి సాధించిన విజయాన్ని, వసంతకాలం రాకను సూచిస్తుందని, ఇది కొత్త ప్రారంభాలు మరియు కొత్త దృక్పథాలను సూచిస్తుందని అన్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన సంప్రదాయాన్ని మనం జరుపుకుంటున్నప్పుడు, హెూలీ ఉదాహరణగా చూపే ఐక్యతా స్ఫూర్తిని మనం స్వీకరించాలని శ్రీ ధంఖర్ అన్నారు. హెూలీ యొక్క ప్రకాశవంతమైన రంగులు భారతదేశ గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తుకు తెస్తాయని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. ఆనందం మరియు ఆనందంతో నిండిన ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఉత్సాహాన్ని మరియు శక్తిని నింపుతుందని మరియు దేశ ప్రజలలో ఐక్యత యొక్క రంగులను మరింతగా పెంచుతుందని శ్రీ మోదీ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు

## ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదల

హైదరాబాద్, మార్చ్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2025 సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదల చేసింది. ఈ పరీక్షలు ఏప్రిల్- మే నెలల్లో నిర్వహించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా అవి జరుగనున్నాయి. థియరీ పరీక్షలు ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26, 2025 వరకు జరుగుతాయి. పరీక్షలు రెండు సెషన్లుగా నిర్వహించబడతాయి - ఒకటి ఉదయం, మరొకటి మధ్యాహ్నం. ఉదయం సెషన్ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఉంటే, మధ్యాహ్న సెషన్ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు కొనసాగుతుంది. పరీక్షల తర్వాత ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 26 నుండి మే 3, 2025 వరకు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలు, హాల్ టికెట్లు, ఇతర వివరాల కోసం విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లు ముందుగానే డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షా కేంద్రానికి కనీసం 30 నిమిషాల ముందు హాజరు కావాలని సూచించబడింది. పరీక్షల సమయంలో అన్ని నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో వ్యవహరించాలి. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తోంది. మరిన్ని వివరాల కోసం అధికారిక అనుబంధాన్ని పరిశీలించవచ్చు.

## యోగా మహెూత్సవ్‌ను ప్రారంభించిన కేంద్ర ఆయుష్ మంత్రి

న్యూ ఢిల్లీ, మార్చ్ 13 (తీన్మార్ న్యూస్): ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 100 రోజుల కౌంట్‌డౌన్‌ను పురస్కరించుకుని, కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ గురువారం న్యూఢిల్లీలో యోగా మహెూత్సవ్- 2025ను ప్రారంభించారు. ఈ సందర్భంగా, 100 రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాలలో పది ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమాల కింద, 10 భాగస్వామ్య దేశాలతో యోగా మార్పిడి కార్యక్రమం అయిన యోగా బంధన్‌ను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. దేశంలోని 10 వేల ప్రదేశాలలో యోగా సంగం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శ్రీ జాదవ్ తెలియజేశారు. యోగా మరియు దాని ప్రపంచవ్యాప్తంగా ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, నేడు ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది యోగాను అభ్యసిస్తున్నారని మంత్రి అన్నారు. యోగా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చిందని ఆయన అన్నారు.

## ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులు

హైదరాబాద్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): వేసవి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ పాఠశాల విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ స్కూళ్లు ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ఏప్రిల్ 23 వరకు ఇలాగే స్కూళ్ల టైమింగ్స్ కొనసాగుతాయి. 10వ తరగతి పరీక్షలు జరిగే స్కూళ్లలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల తాత్కాలిక బంద్

మొదటి పేజీ తరువాయి

పోలీసులు హెూలీ పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా, సామాజిక అసౌకర్యాన్ని నివారించేందుకు పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. భాగ్యనగరంలో హెూలీ పండుగను ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకుంటారు. రంగులు పూసుకుంటూ, కేరింతలు కొడుతూ, వీధుల్లో సందడి చేయడం సాధారణం. అయితే, కొన్ని ప్రాంతాల్లో మద్యం సేవించి అసభ్య ప్రవర్తనకు దిగే ఘటనలు జరుగుతుంటాయి. ఈ తరహా ఘటనలను అరికట్టే చర్యల్లో భాగంగా, హైదరాబాద్ నగర పోలీసులు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. హెూలీ పండుగ రోజు, మార్చి 14 (శుక్రవారం) ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం షాపులు, కల్లు దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లన్నీ మూసివేయాలని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం, సామాజిక సమతుల్యత కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అందరూ పాటించాలని సూచించారు. మద్యం దుకాణాల పరిమితి వల్ల ప్రజలు హెూలీ వేడుకలను మరింత క్రమబద్ధంగా, శాంతియుతంగా జరుపుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. హెూలీ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) పరిధిలోని అన్ని పశువుల కబేళాలు, రిటైల్ బీఫ్ మాంసం దుకాణాలు మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో, హెూలీ రోజున హైదరాబాద్ నగరంలో మద్యం దుకాణాలు, మాంసం షాపులు మూసివేయడం సామాజిక సమాజాన్ని కాపాడే చర్యగా ప్రభుత్వం భావిస్తోంది. శాంతియుతంగా, హర్షాతిరేకాల మధ్య హెూలీ పండుగ జరుపుకోవాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## గ్రూప్-1లో సత్తా చాటిన మండ్ల పవన్ కు అభినందించినా - మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్



దేవరకద్ర ప్రతినిధి,మార్చి13(తీన్మార్ న్యూస్) వనపర్తి జిల్లా కొత్తకోట మండలం వడ్డెవాట గ్రామానికి చెందిన మండ్ల పవన్ కుమార్ గ్రూప్-1లో సత్తా చాటారు.గురువారం నాడు మదనాపురం మండల మాజీ జెడ్పీటిసి కృష్ణయ్య యాదవ్,మండల బిఆర్ఎస్ నాయకులు కొత్తకోట మండల కేంద్రంలోని మండ్ల పవన్ కుమార్ ఇంటికి వెళ్ళి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ప్రస్తుతం పోలిస్ స్టేషన్ లో రైటర్ గా విధులు నిర్వహించిన పవన్ గ్రూప్ వన్ లో మంచి ఫలితాలు సాధించి ఉత్తమ ప్రతిభతో లక్ష్యాన్ని చేరడం అభినందనీయమని కొనియాడుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బిట్లి యాదగిరి,దుప్పల్లి మాజీ సర్పంచ్ చుక్క శివశంకర్,మదనాపురం అధ్యక్షులు ఆవుల బాలకృష్ణ,యూత్ మండల అధ్యక్షులు రాజ్ కుమార్,వడ్డెవాట గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో 10వ విద్యార్థులకు అవగాహన సదస్సు




దేవరకద్ర ప్రతినిధి,మార్చి13(తీన్మార్ న్యూస్) : మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్ హాజరై వారు మాట్లాడుతూ విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలను ఎదుర్కోవాలని అన్నారు.సమయం చాలా విలువైనది కాబట్టి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.9.0 జిపిఏ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులందరికీ 5000/-రూ"బహుమతి ప్రకటించారు.అదేవిధంగా మండల ఎంఈఓ కురుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలను గూర్చిన సూచనలు చేశారు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు భవిష్యత్తును గూర్చిన సూచనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ జ్యోతి,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భరత్,అడ్డాకల్ మండల అధ్యక్షులు మునగల నరేష్,మండల కార్యదర్శి ప్రశాంత్,సహాయ కార్యదర్శి ప్రేమ్, కమిటీ సభ్యులు రాజు, కిరణ్, చరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల, స్కానింగ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ





మహబూబాబాద్ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ నేతృత్వంలో మహబూబాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను, స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ఆయ-ుష్ హాస్పిటల్ ను పరిశీలించినప్పుడు ఆసుపత్రిలోని రికార్డులను నిర్వహణ సక్రమముగా చేయాలని రికార్డ్ లను రెండు సంవత్సరాల వరకు భద్రపరచాల్సి ఉంటుందని తెలిపారు. ఆరోగ్య హాస్పిటల్ స్కానింగ్ సెంటర్ ను పరిశీలించినప్పుడు రికార్డుల నిర్వహణ సరిగా లేనందున షోకాజు నోటీసు జారీ చేస్తున్నట్లు, అనంతరం శారద నర్సింగ్ హోంను తనిఖీ చేశారు. అంతే కాకుండా ప్రైవేట్ హాస్పిటల్లో నిర్వాహకులు వారు అందించి సేవలకు సంబంధించిన ధరల పట్టికను వాడుక భాషలో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ను కూడా ప్రదర్శించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆరోగ్య విద్యా బోధకులు కేవీ రాజు, ఎల్డి కంప్యూటర్ అరుణ్ పాల్గొన్నారు.

## అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో పిల్లల అభివృద్ధి బాధ్యతపై అవగాహన

**ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రొ. గోపు సుధాకర్ హాజరు**



వరంగల్, మార్చి 13 (తీన్మార్ న్యూస్): వరంగల్ నగరంలోని ప్రభుత్వ బాల పరిశీలన గృహం (ఆటోనగర్, కోతవాడ) లో అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పిల్లల అభివృద్ధి మరియు వారి బాధ్యతపై అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థి మండల పరశురాములు అధ్యక్షత వహించారు. ప్రధాన అతిథిగా హాజరైన రిటైర్డ్ ప్రొఫెసర్ గోపు సుధాకర్ మాట్లాడుతూ, ప్రతి పిల్లవాడు కుటుంబం మరియు సమాజం నుండి నైతిక విలువలను నేర్చుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల విద్య మరియు మొత్తం అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలి. బాల కార్మికుడిగా మారకూడదు. ఏ పిల్లవాడు కూడా నేరాలలో కలపకూడదు. బలహీన వర్గాలకు చెందిన పిల్లల సంరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు మరియు సామాజిక సంస్థలు ముందుకు రావాలి. పరిశీలన గృహాలు పిల్లల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రధాన భూమిక పోషిస్తాయి. ఈ సమావేశంలో పరిశీలన గృహ సిబ్బంది, పిల్లలు మరియు ఇతర అతిథులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన ప్రారంభం

మహబూబాబాద్ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): విద్యాశాఖ బలోపేతం, నూతన విద్యా విధానం, తదితర అంశాలపై రాష్ట్ర విద్యా శాఖ సెక్రటరీ యెగితారాణా, కమిషనర్ ఈవి నర్సింహారెడ్డిలు హైద్రాబాద్ నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులు, ప్రోగ్రాం, క్వాలిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యెగితా రాణా మాట్లాడుతూ సీర్ట్ తెలంగాణ ఆద్వర్యంలో సమగ్ర శిక్ష తెలంగాణ విద్యాశాఖ మౌళిక భాషాగణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో కృత్రిమ మేధను ఉపయోగించి బోధన ను మెరుగుపరచడానికి %ఖఇశ్రీ , జునెర్వజూ% ఫౌండేషన్ సహకారంతో మొదటి దశలో పైలెట్ ప్రాజెక్టుగా 6 జిల్లాల్లో ప్రారంభించిందని, ఆయా జిల్లాలలో మెరుగైన ఫలితాలు ఉన్నందున రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలలో కూడా ఈనెల 15 వ తారీకున ప్రారంభించాలని, సంకల్పించమని, ప్రతి జిల్లా నుండి ఒక క్వాలిటీ కంట్రోలర్, ఒక మండల విద్యాశాఖాధికారి, ఒక పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు మరియు ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఇలా ప్రతి జిల్లా నుండి నలుగురికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ, జిల్లాలోని సెలెక్ట్ కాబడిన 7 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, ఆయా పాఠశాలలు ఉన్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఆయా మండలాల విద్యాశాఖాధికారులకు జిల్లా కేంద్రంలోని జీహెచ్ఎస్ మహబూబాబాద్ పాఠశాలలో ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మాట్లాడుతూ



ఈ కార్యక్రమం 3, 4, 5 తరగతుల్లో అమలు, ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలుచే స్తున్నా ప్రాథమిక స్థాయిలో భాషలో అభ్యసనా సామర్థ్యాలు, అలాగే గణితంలో చతుర్విధ ప్రక్రి యల్లో వెనకబాటులోనే ఉంటున్నారు. ఈ విష యాన్ని వివిధ విద్యా పరిశోధన, సర్వే సంస్థలు కూడా వెల్లడి చేస్తున్నాయి. ఈ క్రమంలో కృత్రిమ మేధ సాయంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించడం కోసం కృషి జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్. ఎ.రవిందర్ రెడ్డి, ప్రారంభించారు. AI కృత్రిమ మేధ ను విద్యారంగంలో ఉపయోగించడం చాలా ఉపయోగకరమైన ఆలోచన అని ,ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ AI బోధన తక్కువ అభ్యసన స్థాయిలు కలిగిన విద్యార్థులకు వారివారి స్థాయిలకు అనుగుణంగా ప్రశ్నలను రూపొందించి, వారిలో అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా దోహదపడుతుంది అని అన్నారు.

**జిల్లాలో ఎంపికైన ప్రాథమిక పాఠశాలలు:**

1. సీరోలు మండలం -చింతపల్లి
2. సీరోలు మండలం -కొత్తూరు
3. సీరోలు మండలం- సీరోలు
4. కేసముద్రం మండలం- ఇంటికన్నె
5. గూడూరు మండలం -మచ్చర్ల
6. తొర్రూరు మండలం -అమ్మాపురం
7. పెద్దవంగర- పెద్దవంగర

ఈ కార్యక్రమంలో RP లుగా ఆజాద్ చంద్రశేఖర్ (QC) ,రవికుమార్ (MEO),విజయ్ కుమార్ (SCHM) ,యాదగిరి (SGT) వ్యవహరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ఎన్ఐసి హాల్ నుండి, విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి తెలుగు మహిళ కవయిత్రి మొల్ల మాంబ జయంతి



దేవరకద్ర ప్రతినిధి,మార్చి13(తీన్మార్ న్యూస్) : తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం మహబూబ్ నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళ కవయిత్రి ఆతుకూరి మొల్ల మాంబ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.15వ.శతాబ్దంలో కుమ్మర కులంలో ఉద్భయించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి, శ్రీ శ్రీ శ్రీ ఆత్కూరి మొల్లమాంబ అని 24 వేల శ్లోకాలతో 7 ఖండాలతో ఉన్న రామాయణాన్ని 871 శ్లోకాలతో 8 ఖండాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో సంక్షిప్తంగా సరళ భాషలో రామాయణాన్ని రచించిన తొలి తెలుగు కవయిత్రి కుమ్మర్ల ఆడపడుచు శ్రీ శ్రీ శ్రీ ఆత్కూరి మొల్లమాంబ అని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న అన్నారు.ఆత్కూరి మొల్లమాంబ 15వ శతాబ్దానికి చెందిన మహోన్నత వ్యక్తి అని స్త్రీలకి విద్య అవసరం లేదని,అక్షరాస్యత వైపు అడుగులు వేయవలసిన పని లేదని మహిళలను పక్కన పెట్టిన నాటి కాలంలో స్త్రీ కవిత్వం పై,సూద్ర కవిత్వం పూర్తిగా నిషేదం ఉన్న ఆ రోజులలో, సరస్వతీ తనయులుగా ఉన్న స్త్రీలు సాహిత్యంలో ఏమాత్రం తక్కువ కాదని ప్రకృతిని ఆరాధించి సమాజాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరు సాహిత్య ప్రియులేనన్న సత్యాన్ని, అక్షర రూపం చేసింది మహనీయ మూర్తి అన్నారు.స్పందించే హృదయం ఉంటే చాలు,సాహిత్యంలో స్త్రీలు కూడ తక్కువ కాదని,నిరూపించింది అంత గొప్ప చరిత్ర ఉన్న కవయిత్రి ముళ్ళ జయంతి కార్యక్రమం అధికారికంగా నిర్వహించాలని కుమ్మర సంఘం తరపున ప్రభుత్వాన్ని కోరుతామని కుల సంఘ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్,మాజీ కౌన్సిలర్ రవి కిషన్ రెడ్డి,బి ఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు శివరాజు ,మాజీ మూడా చైర్మన్ గంజి ఆంజనేయులు, బీసీ సభ రాష్ట్ర అధ్యక్షులు మెట్టుగాడి శ్రీనివాస్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు సారంగి లక్ష్మీకాంత్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ సాగర్, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు దుర్గేష్, గౌరవ అధ్యక్షులు వి. రామచంద్రయ్య,ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, కోశాధికారి రవి శేఖర్, మహబూబ్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు నాగప్ప,జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షులు కొండల్, ప్రధాన కార్యదర్శి గోపాల్, రవికుమార్,మాసయ్య ,వెంకటయ్య ఉపసర్పంచ్ డీలర్ రాజు, నర్సప్ప ,ఆంజనేయులు, బాలచందర్, రామచంద్రయ్య, పోలీస్ డిపార్ట్మెంట్ రాము అన్ని మండలాల అధ్యక్ష కార్యవర్గ సభ్యులు కుల పెద్దలు యువకులు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీలో ఘనంగాఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు





హనుమకొండ కేయు, మార్చి 13 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు కేయు జేఏసీ ఛైర్మెన్, బీసీ నాయకులు కత్తెరపల్లి దామోదర్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఉదయం కేక్ కటింగ్ చేసి మొక్కలు నాటడం జరిగింది. అనంతరం కత్తెరపల్లి దామోదర్, హసన్ పర్తి బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు బండి రజనీకుమార్, పాలమాకుల కొమురయ్య కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసిఆర్, ప్రో జయశంకర్ ల మార్గదర్శకంలో కవితల ఎన్నో పోరాటాలలో పాల్గొని రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర వహించిన వ్యక్తి కవితక్కఅని, తెలంగాణ ఉద్యమంలో జాగృతి సామాజిక సంస్థను ఏర్పాటు చేసి మహిళలను చైతన్య పరుస్తూ ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ పండుగ ను వ్యాపింప చేసిన గొప్ప నాయకురాలు కవితక్క మహిళలకు చట్టసభల్లో ముప్పై మూడు శాతం రిజర్వేషన్ కావాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేసి మహిళల కోసం ఎన్నో పోరాటాలు చేసి రిజర్వేషన్ సాధించిన గొప్ప నాయకురాలు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో కామరెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు ఇచ్చినటువంటి హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి బీసీ సంఘాలను సంఘటితం బీసీల హక్కుల కోసం నిలదీయడం జరిగింది. బీసీలకు చట్ట సభలో మూడు బిల్లు పెట్టాలని విద్యా ఉద్యోగ రాజకీయ లలో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని పోరాటం చేసి కాంగ్రెస్ మెడలు వంచి గురువారం చట్టసభలో విద్యా ఉద్యోగ మరియు రాజకీయ బిల్లు పెడతానని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకునే విధంగా చేసిన ఘనత కవితక్కకే చెందుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కలకోట్ల సుమన్, బొమ్మ ఉజ్వల్ కుమార్, కెత్తే పూర్ణ చందర్, మోహన్ రెడ్డి, పిన్నింటి విజయ్, రాజు, రాకేష్, శశి కుమార్, అరవింద్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిరుపయోగంగా పీవీ విజ్ఞాన కేంద్రం

**ప్రారంభానికి నోచుకోని వైనం**

**పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించాలి**

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్**




హనుమకొండ కేయు, మార్చి 13 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలో నిర్మించిన పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. 2021 సంవత్సరంలో శంకుస్థాపన చేసిన పీవీ విజ్ఞాన కేంద్రం పూర్తయి సంవత్సరం గడుస్తున్న దాన్ని ప్రారంభం చేయడం పట్ల యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాని నిర్వహణ కోసం డైరెక్టర్ డాక్టర్ కృష్ణ నియమించిన, దాంట్లో కనీసం సౌకర్యాలు కల్పించ లేదని, అందులో ఇప్పటివరకు కనీసం టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేయలేదని, పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రం ప్రారంభానికి నోచుకోకపోవడం వలన అందులో పిచ్చి మొక్కలు వ్యర్థాలకు నిలయంగా మారుతుందని, యూనివర్సిటీలో కొన్ని డిపార్ట్మెంట్ లకు సరైన వసతులు లేక అందులో వసతి కల్పించాలని కోరినప్పటికీ, అవేమీ పట్టించుకోకుండా, విద్యార్థుల సౌకర్యం కోసం, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం కోసం సాహిత్యము, వర్క్ షాపులు,సెమినార్లు నిర్వహించాల్సిన అధికారులు దాన్ని ప్రారంభించకుండానే సంవత్సరానికి ఒకసారి పీవీ నరసింహారావు వర్ధంతి, జయంతి, సందర్భంగా చిత్రపటానికి బయటనే పూల మాల వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, తిరుపతి విజ్ఞప్తి చేశారు.

## చాకలి ఐలమ్మ కుటుంబాన్ని పరామర్శించిన ఎన్హెచ్ఆర్సి. రాష్ట్ర అధ్యక్షులు



పాలకుర్తి, మార్చి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు స్వర్గీయ వీరనారి చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) కుటుంబాన్ని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య, సామాజికవేత్త, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వ్యక్తిగత సహాయకులు దొంతి విజేందర్ రెడ్డితో కలిసి పరామర్శించారు. ఇటీవల ఐలమ్మ మనుమడు చిట్యాల రామచంద్రం పరమపదించగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రామచంద్రం కొడుకు సంపత్ ఇటీవల ప్రమాదంలో గాయపడగా ఆరోగ్యం గురించి వాకబు చేసి మనోధైర్యంగా ఉండాలని సూచించారు. కోడలు శ్వేతఐలమ్మను ఓదార్చారు. 20 సంవత్సరాలుగా రామచంద్రం పాలకుర్తి గ్రామ సర్పంచ్ గా నిస్వార్థంగా, నిజాయితీగా సేవలు అందించడం గొప్ప విషయం అని వారు గుర్తు చేశారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన సంపత్- శ్వేతఐలమ్మల కుటుంబ దీనపరిస్థితి చూసి చలించారు. ఇటీవల తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రకటించిన శ్వేతఐలమ్మను అధికారికంగా నియమించి తెలంగాణ తల్లి, త్యాగమూర్తి చాకలి ఐలమ్మ కుటుంబానికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేకంగా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రిగారికి డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య విజ్ఞప్తి చేశారు. శ్వేతఐలమ్మ-సంపత్ ల పరిస్థితిని గౌరవ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు దొంతి విజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యదర్శి కోమాండ్ల శ్రీనివాస్, జనగామ జిల్లా ఇన్చార్జి బస్కే నాగరాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు విసంపెల్లి నగేష్, సోషల్ మీడియా టీం సభ్యులు ఎం రాజేందర్, గణేష్, మాజీ సర్పంచ్ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

**స్పందించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి**

ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు విజేందర్ రెడ్డి ద్వారా పూర్తి సమాచారం తెలుసుకున్న గౌరవ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి స్పందించారు. ఐలమ్మ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని, రామచంద్రం గారి కర్మలకు సంబంధించిన అన్ని ఖర్చులు భరిస్తామని తగిన ఏర్పాట్లకు పూర్తి ఆదేశాలు ఇచ్చారని, అలాగే ప్రమాదంలో గాయపడిన సంపత్ ఆరోగ్యానికి మెరుగైన వైద్యం కోసం పూర్తి సహకారం అందిస్తామని, గౌరవ ముఖ్యమంత్రిని కలిసి శ్వేతాఐలమ్మకు మహిళా కమిషన్ సభ్యురాలి నియామక విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారని విజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఆర్ సి. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మానవతా హృదయంతో స్పందించి తగు ఏర్పాట్లకు ఆదేశాలు ఇచ్చిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గొప్పమనసుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దాసోజుకు శుభాకాంక్షలు తెలిపిన దాస్యం



హనుమకొండ, మార్చి 13 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్ర సమితి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి (శాసనసభ్యుల కోటా) దాసోజు శ్రవణ్ కి మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం రోజున ఆయన్ను కలిసి శాలువాతో సత్కరించారు. తెలంగాణ ప్రజల గొంతుకను శాసనమండలిలో శ్రవణ్ బలంగా వినిపిస్తారని అన్నారు.

## జిల్లా ప్రజలకు హెూళీ శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): హెూళీ పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జిల్లా ప్రజలకు హెూళీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హెూళీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హెూళీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హెూళీ నిర్వహించుకోవాలని హితవు పలికారు.

# సరస్వతి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి





## ఇంజినీరింగ్ అధికారులను ఆదేశాలు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): సరస్వతి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కాళేశ్వరం ఈ ఓ కార్యాలయంలో ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి పుష్కరాలు సందర్భంగా చేపడుతున్న పనులపై పంచాయతి రాజ్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్, వైద్య, దేవస్థానం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 25 వరకు పుష్కరాల అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో జాప్యం తగదని, వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్లు, రోడ్లు, శానిటేషన్, తాగునీటి సదుపాయాల పనులను గడువులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో సంబంధిత శాఖల సమన్వయం ఎంతో ముఖ్యమని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వివఐపీ ఘాటును సందర్శించి వివిఐపీ ఘాట్ నుంచి స్నాన ఘట్టాల వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం, సరస్వతి తల్లి విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ వాచ్ టవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ స్థలాలు గుర్తించి నివేదిక అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, డిపిఓ నారాయణరావు, విద్యుత్ శాఖ డీఈ రామిరెడ్డి, దేవస్థానం ఈవో మహేష్, ఆర్కి టెక్చర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై కలిసి పోరాడాలి

### ఐహెచ్ఆర్సి సౌత్ ఇండియా అధ్యక్షుడు షేక్ గౌస్



ములుగు జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): నూతనంగా ములుగు జిల్లాలో నియామకమైన అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ ( ఐ హెచ్ ఆర్ సి) కమిటీ సభ్యులు ప్రజల సమస్యలపై కలిసి పోరాడాలని సౌత్ ఇండియా అధ్యక్షుడు షేక్ గౌస్ అన్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న కమిటీ సభ్యులతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలో ఎస్పీ డాక్టర్ శబరిష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ చేపట్టబోయే పనుల వివరాలను ఎస్పీకి తెలియజేశారు. నిబంధనలకు లోబడి ఉండాలని ఎస్పి అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు సూచించారు. అనంతరం సౌత్ ఇండియా అధ్యక్షుడు షేక్ గౌస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వెంకన్నతో పాటు కమిటీ సభ్యులకు ఐడి కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి చిన్న సమస్య వచ్చినా వెంటనే రాష్ట్ర కమిటీకి సౌత్ ఇండియా కమిటీకి తెలియజేయాలని, బాధితుల తరపున సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. న్యాయపరమైన సలహాల కోసం రాష్ట్ర కమిటీ లో ఉన్న లీగల్ సర్వీస్ సభ్యులకు జిల్లా కమిటీ లోని న్యాయవాదిని సంప్రదించి అనంతరమే ముందడుగు వేయాలన్నారు. సాధ్యమైనంత వరకు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూక్య సునీల్, జిల్లా కార్యదర్శులు, కుదురుపాక రాజేష్, బానోతు జవహర్ లాల్, సహాయ కార్యదర్శి, కెత్తె ,ఆనంద్ ( నందు) జిల్లా ఉపాధ్యక్షులు, కంచర్ల రాజు, జానుపట్ల జయరాజ్, కో కన్వీనర్, రుద్రబోయిన మల్లేష్ గౌడ్, ఆర్గనైజర్ సెక్రెటరీ, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

# ఇక నుండి సదరం సర్టిఫికెట్ బదులుగా యూడీఐడీ కార్డులు

### అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



ములుగు జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): మీసేవ నిర్వాహకులందరూ యూడీఐడీ అప్లికేషన్ పై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూడీఐడీ పోర్టల్ , మీసేవ, ఆధార్ సాంకేతిక సమస్యల పై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇకనుండి సదరం సర్టిఫికెట్ కి బదులుగా యూనిక్ డిసబిలిటీ ఐడి కార్డుని ఇవ్వడం జరుగుతుందని దీని గురించి మీసేవ నిర్వాహకులు అందరికీ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. దేశం లో ఎక్కడైనా ఈ కార్డు చెల్లుబాటు అవుతుందని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్లికేషన్ చేయాలని, త్వరలోనే డిజబులిటీ స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి స్లాట్ తేదీలను తెలియజేస్తామని తెలిపారు. మీసేవ నిర్వాహకులకు యూడీఐడీ ఆన్లైన్ అప్లికేషన్ నమోదు గురించి ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ– డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ త్వరలోనే మీసేవలో కొత్తగా ఇన్సూరెన్స్, కొరియర్ సర్వీసులు మరియు బ్యాంక్ ఆధారిత కస్టమర్ సర్వీస్ లను పొందుపరచనున్నామని తెలిపారు. మళ్ళీ మీసేవ లకి మంచి రోజులు రాబోతున్నాయని , కొత్త సర్వీసులపై అవగాహన కల్పించారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేయాలని తెలిపారు. మీసేవ అంటే ఒక బ్రాండ్ అని దానిని చెడగొట్టేలా ఎవరు వ్యవహరించకూడదని అన్నారు. కొంతమంది మీసేవ నిర్వాహకులు ఫిక్స్ రేటు కంటే ఎక్కువ రుసుము వసూలు చేస్తున్నారని మా దృష్టికి వస్తే అట్టి మీసేవ సెంటర్ పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మీసేవ సెంటర్లో మీసేవ సర్వీసుల ధరల పట్టిక కలర్స్, తగిన ఫ్లెక్సీలు మీ సేవలో, పవర్ బాకప్, కుర్చీలు, పరిష్కారం కాల్ సెంటర్ 1100, ఈడీఎం, తాహసిల్దార్ మొబైల్ నెంబర్ తప్పకుండా డిస్ప్లే లో పెట్టాలని తెలిపారు. ఆధార్ సెంటర్ ను తప్పకుండా గవర్నమెంట్ ప్రేమిసెస్ లోనే నడపాలని తెలిపారు. మీసేవ అప్లికేషన్స్ చేసేటప్పుడు తప్పులు లేకుండా చేయాలని, చిన్న చిన్న తప్పుల వలన ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగ వలసి వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రాంతీయ వైద్యశాల సూపరిడెంట్ డాక్టర్ జగదీష్, డిపిఎం పెన్షన్స్ రేవతి, టీజీటిఎస్ మేనేజర్ విజయ్, టీజీ ఆన్లైన్ మేనేజర్ రాకేష్, 9 మండలాల మీసేవ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీసే వేదిక యువ ఉత్సవ్

### జిల్లా కేంద్రంలో నిర్వహించిన నెహ్రూ యువకేంద్ర మై భారత్

### ప్రశంసించిన జిల్లా విద్యాధికారి రాజేందర్






జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): విద్యార్థులతో పాటుగా య-ువతలో ఉన్న వివిధ రకాలనైపుణ్యాలు వెలికితీసే వేదికగా నెహ్రూ యువకేంద్రం, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ నిలిచిందని జిల్లా విద్యాధికారి రాజేందర్ ప్రశంసించారు. జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ పీజీ కళాశాలలో కార్యక్రమ నిర్వాహకులైన నెహ్రూ యువకేంద్ర మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మాట్లాడుతూ పంచప్రాణ్ అనే అంశాలతో ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. భారత ప్రభుత్వం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలిచే లక్ష్యంతో చేస్తున్న కృషిలో భాగంగా యువ ఉత్సవ్లో విద్యార్థులను భాగం చేస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం చేపడుతున్న కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం సంతోషకరం అని అన్నారు. యువ ఉత్సవ్కు ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా జిల్లా విద్యాధికారి రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యా సంబంధమైన అంశాలతో పాటుగా ఇతర అంశాల్లోనూ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. ఆయా నైపుణ్యాలను వెలికితీసే విధంగా నెహ్రూ యువకేంద్ర మై భారత్ యు వ ఉత్సవ్ నిలిచిందని కొనియాడారు. ఏడు పోటీలలో పాల్గొన్న విజేతలకు అభినందనలు తెలిపారు. జిల్లా యువజన సంక్షేమాధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని ప్రశంసించారు. యువతీ యువకులు ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలని సూచించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ సూరునేని మాట్లాడుతూ, యువత చదువుతో పాటుగా పోటీ పరీక్షలు, వ్యక్తిత్వ వికాసం అంశాలపై సైతం దృష్టి పెట్టాలని కోరారు. విజేతలుగా నిలిచే విధంగా వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా సైన్స్ అధికారి స్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, అధ్యాపక బృందం, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన అదనపు కలెక్టర్



ములుగు జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఉన్న ఈవీఎం గోదాములను గురువారం అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోడౌన్ లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదికను పంపిస్తున్నామని తెలిపారు. ఈవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోడౌన్ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవిఎం గదులను, అక్కడ భద్రత ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయ భాస్కర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

### రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్

### కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్ స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే పంపాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు. ఈ జూమ్ సమీక్ష సమావేశం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ అశ్వరావుపేటలో ఐటిఐ స్థాపనకు స్థల గుర్తింపు ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు. గుర్తించిన స్థలం రహదారికి దగ్గరలో ఆర్టీసీ రవాణా సౌకర్యం కూడా ఉందని, దగ్గరలో పరిశ్రమలు కూడా ఉన్నాయని, ఐటిఐ స్థాపనకు అన్ని రకాల అనువైన స్థలాన్ని గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోనే అశ్వరావుపేట ఆయిల్ ఫామ్ కు హబ్ గా ఉందని మరియు అశ్వరావుపేటలో వ్యవసాయ కళాశాల కూడా ఉన్నందున ఐటిఐ కళాశాలలో వ్యవసాయనికి సంబంధించి కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ సూచించారు. దానికిగాను ఏ కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఎక్కువ లాభం చేకూరుతుందో తగిన నివేదికల సమర్పించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ కలెక్టర్ కు సూచించారు.

# మార్చి 19 లోపు పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




ములుగు జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాల పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకు ఒకసారి పకడ్బందీగా అప్ డేట్ కావాలని, నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఓటర్ జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాల పై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించే సమయంలో మీటింగ్ మినిట్స్ పకడ్బందీగా నమోదు చేసుకోవాలని, సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంతకాలను ప్రత్యేకమైన రిజిస్టర్ లో తీసుకోవాలని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, ఏం.ఆర్.ఓ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటర్ నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ వివరాల తొలగింపు వివిధ అంశాలకు వాడే ఫారం 6,7,8 వివరాలను పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధైర్యం, స్వేచ్ఛతో మహిళ సాధికారత సాధ్యం

### ఐఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి బోరింగ్ శ్రీనివాస్





ఆత్మకూర్ మార్చ్ 13 తీన్మార్ న్యూస్:- మహిళలు ధైర్యంగా స్వేచ్ఛగా ఉన్నప్పుడు మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఐఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి బోరింగ్ శ్రీనివాస్ సూచించారు. ఐఎన్టియూసి మహిళా దినోత్సవ 'యాక్సిలరేట్ యాక్షన్' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆత్మకూర్ లోని మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోరింగ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ధైర్యంగా, స్వేచ్ఛగా ఉండాలని అన్నారు. లింగ సమానత్వాన్ని, హక్కులను స్వేచ్ఛగా అనుభవించినప్పుడే మహిళా సాధికారిక సాధించినట్లని చెప్పారు. ఆపదలో ఉన్న మహిళా కార్మికులకు ఐఎన్టీయూసీ అండగా ఉంటుందని, అధైర్య పడకుండా మహిళా హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని మహిళలకు కే. బోరింగ్ శ్రీనివాస్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు గంగు మాధవరెడ్డి. మదనాపురం మండల అధ్యక్షులు జమీల్. అమరచింత అధ్యక్షులు దాస్. ఐ ఎన్ టి యు సి కార్మిక నాయకులు మాసన్న. శేఖర్ తదితర బీడీ కార్మికులు పాల్గొన్నారు..

# జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి




### జనసేన పిఠాపురం ఆవిర్భావ కరపత్రాలు ఆవిష్కరణ

సూర్యాపేట, మార్చి 13 (తీన్మార్ న్యూస్): నేడు పిఠాపురంలో జరిగే జనసేన 12వ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని సూర్యాపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అజయ్ జనసేన అన్నారు. జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ వ్యవస్థాపకులు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగే జనసేన ఆవిర్భావ సభ కరపత్రాలను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో కూడా జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. పిఠాపురంలో జరిగే జన సేన ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జనసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నెమ్మూరి శంకర్ గౌడ్, మునుగోడు నియోజకవర్గ ఇంచార్జీ గోకుల రవీందర్ రెడ్డి, ఖమ్మం ఇంచార్జీ మిరియాల రామకృష్ణ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జి మేకల సతీష్ రెడ్డి, హుజూర్ నగర్ ఇంచార్జీ నాగేశ్వరరావు, ల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు నెమ్మాని మహేష్, వంశీ, ఆరాల రమేష్ యాదవ్, లోకేష్, శ్రవణ్, శంకర్, బానోతు వంశీ, పడిదల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాగృతివ్యవస్థాపక అధ్యక్షురాలు కవితక జన్మదిన వేడుకలు




ములుగు, మార్చి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా ములుగు జిల్లా జాగృతి నాయకులు అంతటి రాము ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవిపేట గ్రామంలోని 10వ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు ఎక్జామ్ కిట్ అందించడం జరిగింది. అనంతరం కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు గునిగంటి హరీష్, ముడిగె రాజ్ కుమార్,పోలం శ్రావణ్,మూడ్ తిరుపతి,బొల్లవేని రమేష్, జంగిలి శ్రీకాంత్, సాగర్, రాజు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతో తెలుగు టీచర్ను నియమించిన వినయ్ కుమార్ రెడ్డి



ఆత్మకూర్ మార్చ్ 13 తీన్మార్ న్యూస్: వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో తెలుగు బోధించేందుకు సిబ్బంది లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు ఉల్లుపాల వినయ్ కుమార్ రెడ్డి తెలుగు బోధించేందుకు ప్రైవేటుగా ఓ మహిళా ఉపాధ్యాయురాలి నీ నియమించారు ఈ సందర్భంగా ఆమెకు ప్రతినెల రూ 5000 రూపాయలు ఇచ్చేందుకు ఏడాది పాటు ఒప్పందం కుదుర్చుకున్నారు. నేడు ఆ మహిళా ఉపాధ్యాయురాలికి మొదటి నెల జీతం ఐదు వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం వారి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా ప్రజలకు హోళీ శుభాకాంక్షలు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): హోళీ పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా ప్రజలకు హోళీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హోళీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హోళీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హోళీ నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన ప్రారంభం

వరంగల్ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): విద్యాశాఖను బలోపేతం, నూతన విద్యా విధానం, తదితర అంశాలపై రాష్ట్ర విద్యా శాఖ సెక్రటరీ డా. యెగితారాణా, కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి లు హైద్రాబాద్ నుండి గురువారం రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులు, ప్రోగ్రాం, క్వాలిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యెగితా రాణా మాట్లాడుతూ సీర్ట్ తెలంగాణ ఆద్వర్యంలో సమగ్ర శిక్ష తెలంగాణ విద్యాశాఖ మౌలిక భాషాగణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో కృత్రిమ మేథను ఉపయోగించి బోధన ను మెరుగుపరచడానికి axl , Ekstep ఫౌండేషన్ సహకారంతో మొదటి దశలో పైలెట్ ప్రాజెక్టు గా 6 జిల్లాల్లో ప్రారంభించిందని ఆయా జిల్లాలలో మెరుగైన ఫలితాలు ఉన్నందున రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలలో కూడా ఈనెల 15 వ తారీకున ప్రారంభించాలని, సంకల్పించమని ,
ప్రతి జిల్లా నుండి ఒక క్వాలిటీ కోఆర్డినేటర్, ఒక మండల విద్యాశాఖాధికారి , ఒక పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు మరియు ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఇలా ప్రతి జిల్లా నుండి నలుగురికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చిందన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక కాబడిన 11 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, ఆయా పాఠశాలలో ఉన్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఆయా మండలాల విద్యాశాఖాధికారులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. మార్చి 15 న ఎంపికైన 11 స్కూళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్లాసులు ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా లో ఎంపికైన 11 స్కూల్స్ చెన్నారావుపేట మండలం ఎంపీపీ ఎస్ లింగాపురం, ఎంపీపీ ఎస్ జల్లి, ఎంపీపీ ఎస్ పాపయ్యపేట, గీసుకొండ మండలం ఎంపీపీ ఎస్ మచ్చాపూర్, నర్సంపేట్ ఎంపీపీ ఎస్ మహేశ్వరం, పర్వతగిరి మండలం ఎంపీపీ ఎస్ గోపనపల్లి, రాయపర్తి మండలం ఎంపీపీ ఎస్ మైలారం, ఎంపీపీ ఎస్ కొలన్ పల్లి, ఎంపీపీ ఎస్ ఊకల్ ఎంపీపీ ఎస్ తిరుమలయపల్లె, ఎంపీపీ ఎస్ కాట్రేపల్లి లలో ప్రారంభించడం జరుగునని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి డిఇఓ జ్ఞానేశ్వర్, సుజన్ తేజ క్వాలిటీ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్





హనుమకొండ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ప్రతిరోజు ఆహార పదార్థాలకు సంబంధించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రతను పాటించాలని సూచించారు. మెనూ ను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు అధ్యాపకులతో మాట్లాడారు.

# ఈ నెల 15 నుంచి ఏ.ఐ . ద్వారా విద్యార్థులకు విద్యా బోధన

### విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

### 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస అభ్యాస లక్ష్యం

### హాజరైన కలెక్టర్ పి ప్రావిణ్య



హనుమకొండ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): ఈ నెల 15 వ తేదీ నుంచి జిల్లాలలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఏ.ఐ ను వినియోగిస్తూ సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డితో కలిసి ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో సర్కార్ బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద 6 జిల్లాల్లో ప్రారంభించామని, అది మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని మార్చి 15 నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు, అభ్యాస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రతి జిల్లాలో కొన్ని ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ముందస్తుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు ఏ.ఐ వినియోగిస్తూ సులభతరంగా విద్యా బోధన చేయాలని అన్నారు. ఏ.ఐ. కోర్సు ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు వీలుగా ప్రతి పాఠశాలలో ఐదు కంప్యూటర్లు, అవసరమైన ఇంటర్నెట్ కనెక్షన్, హెడ్ ఫోన్స్ ఇతర సామాగ్రి అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి సూచించారు. జిల్లాలో ముందుగా ఎంపిక చేసిన పాఠశాలలో ఏ ఏ కోర్సు ద్వారా విద్య బోధన జరుగుతుందని, ఇక్కడ వచ్చే ఫలితాలను అంచనా వేస్తూ భవిష్యత్తులో దీన్ని మరింత విస్తరించి ఎందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ లను ఉపయోగించి విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి వారితో వారికి ఎఫ్ఎల్ఎం తో వచ్చే ఫలితాలను వివరించాలని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చదవడం రాయడం లో ఇలాంటి ఇబ్బంది పడకుండా చూడాలని ఉంది ప్రధాన ఉద్దేశం కంప్యూటర్లు ఇతర సామాగ్రి కోసం స్వచ్ఛంద సంస్థలను ఇతర సంస్థలను నుంచి సహాయం తీసుకోవచ్చు అని తెలిపారు అలాగే ఆయా జిల్లాల్లో అవసరమైన సామాగ్రి ఇతర పరికరాలు వివరాలను తమకు పంపించాలని సెక్రెటరీ విద్యాశాఖ సెక్రటరీ సూచించారు. ఈ కాన్ఫరెన్సో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

### అధికారులందరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

### ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులను నిర్వర్తించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16న ఘనపూర్ (స్టేషన్) లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు కార్యక్రమంలో పాల్గొనే వీవీఐపీలకు అన్ని వసతులను సమకూర్చాలని, సీఎం జిల్లాకు చేరుకున్న మొదలు నుంచి తిరిగి వెళ్ళే వరకు ఎక్కడా కూడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరెవరికి ఏ ఏ బాధ్యతలు అప్పగించారో వారు సమర్ధవంతంగా నిర్వర్తించాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద అగ్నిమాపక యంత్రంతో సిబ్బంది, బ్యారికేడింగ్, అంబులెన్స్, ఆక్సిజన్ సిలిండర్, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, స్టేజ్, పోడియమ్స్, ఫ్లెక్సీ, పార్కింగ్ వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలన్నారు. బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి వసతి, మూత్రశాలలు, మజ్జిగ ప్యాకెట్ లు, అలాగే ప్రతి కంపార్ట్మెంట్ లలో ఇద్దరు ఏఎన్ఎంలను నియమించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఔషధాలను అందుబాటులో ఉంచాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు పర్యవేక్షిస్తూ పూర్తిచేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, జెడ్పీ సీఈవో మాధురీ కిరణ్ చంద్ర షా, డిప్యూటీ జెడ్పీ సీఈవో సరిత, డీపీఓ స్వరూప, డీఆర్డీఏ వసంత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15న ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ బోధన ప్రారంభం

## రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా



జనగామ జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): గురువారం, హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా, కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి లు విద్యా శాఖ బలోపేతం, నూతన విద్యా విధానం, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులు, అకడమిక్ పర్యవేక్షణ అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ దృశ్య మాధ్యమ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి మాట్లాడుతూ ఎస్సీఈఆర్టీ తెలంగాణ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా తెలంగాణ విద్యా శాఖ మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో భాగంగా కృత్రిమ మేధను ఉపయోగించి బోధనను మెరుగుపరిచేందుకు ఏఎక్స్ఎల్, ఏక్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో మొదటి దశలో పైలట్ ప్రాజెక్టుగా (6) జిల్లాల్లో ప్రారంభించిందని, ఆయా జిల్లాల్లో మెరుగైన ఫలితాలు సాధించినందున రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో కూడా ఈ నెల 15వ తేదీన ప్రారంభించేందుకు గాను సంకల్పించామని, ప్రతి జిల్లా నుంచి ఒక అకడమిక్ మానిటరింగ్ అధికారి, ఒక మండల విద్యాధికారి, ఒక పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఇలా ప్రతి జిల్లా నుంచి నలుగురికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ కృత్రిమ మేధ సాయంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసనా సామర్థ్యాలను సాధించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. కృత్రిమ మేధను విద్యారంగంలో ఉపయోగించడం చాలా గొప్ప ఆలోచనని, ఈ కృత్రిమ మేధ బోధన వెనుకంజలో ఉన్న విద్యార్థులకనుగుణంగా ప్రశ్నలను రూపొందించి, వారిలో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

జిల్లాలో ఎంపికైన ప్రాథమిక పాఠశాలలు:

1. బచ్చన్నపేట మండలం - ఎంపీపీఎస్ ఇటుకాలపల్లి
2. బచ్చన్నపేట మండలం - ఎంపీయూపీఎస్ దుబ్బకుంటపల్లి
3. చిల్పూర్ మండలం - ఎంపీపీఎస్ రాజవరం
4. చిల్పూర్ మండలం - ఎంపీపీఎస్ లింగంపల్లి
5. చిల్పూర్ మండలం - ఎంపీపీఎస్ శ్రీపతిపల్లి
6. దేవరుప్పుల మండలం - ఎంపీపీఎస్ నీర్మల
7. జనగామ మండలం - ఎంపీపీఎస్ మరిగడి
8. కొడకండ్ల మండలం - ఎంపీయూపీఎస్ పాకాల
9. లింగాల ఘనపురం మండలం - ఎంపీపీఎస్ కళ్లెం
10. లింగాల ఘనపురం మండలం - ఎంపీయూపీఎస్ నేలపోగుల
11. పాలకుర్తి మండలం - ఎంపీపీఎస్ బొమ్మెర
12. పాలకుర్తి మండలం - ఎంపీపీఎస్ తొర్రూరు(జే)
13. తరిగొప్పుల మండలం - ఎంపీపీఎస్ అబ్దుల్ నాగారం
14. జాఫర్గడ్ మండలం - ఎంపీపీఎస్ ఉప్పుగల్
15. జాఫర్గడ్ మండలం - ఎంపీపీఎస్ తిడుగు
16. జాఫర్గడ్ మండలం - ఎంపీపీఎస్ హిమ్మత్ నగర్
17. పాలకుర్తి మండలం - ఎంపీపీఎస్ చెన్నూర్

ఈ వీడియో సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, ఏఎంఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ

### వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 13 (తీన్మార్ న్యూస్): మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాల పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకు ఒకసారి పకడ్బందీగా అప్ డేట్ కావాలని, నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఓటర్ జాబితా సవరణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాల పై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, ఏం.ఆర్.ఓ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటర్ నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ వివరాల తొలగింపు వివిధ అంశాలకు వాడే ఫారం 6,7,8 వివరాలను పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, ఎలక్షన్ సూపరిండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలి

## అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్



ఆత్మకూరు మార్చ్ 13 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్ కాళీమాత దేవాలయం వద్ద అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో హోలీ పండుగ గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండరాదని పలు సూచనలు సలహాలు ప్రజలకు వివరించారు. పట్టణ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అమరచింత పోలీస్ శాఖ సిబ్బంది పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు




సూర్యాపేట, మార్చి 13 (తీన్మార్ న్యూస్): జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జానపహాడ్ దర్గా నందు బీఆరెస్ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆరెస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్ కుమార్ బిఆర్ యస్వి రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్ ఆధ్వర్యంలో దర్గా నందు పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి పండ్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ తండ్రి పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదని తండ్రి బాటలో పయనించి రాజకీయాల్లోకి వచ్చింది అని బతుకమ్మతో తెలంగాణ సంప్రదాయాన్ని యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యర్థుల కుట్రలను చిత్తు చేస్తూ దొంగ కేసులకు తలొగ్గేది లేదు అని ధైర్యంగా చాటి చెప్పి ప్రజల కోసం పోరాడుతున్న డాటర్ అఫ్ ఫైటర్ కల్వకుంట్ల కవిత అని అన్నారు. జానపహాడ్ సైదన్న ఆశీస్సులు ఆమెపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో హరిత సేన ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ ఇంచార్జి ఇంజమూరి రాజేష్, పాలకవీడు మహిళా అధ్యక్షురాలు మమత, అంజి యాదవ్, గుర్రాల శ్రీకాంత్, ముస్తాక్, శ్రీను నాయక్, రాజశేఖర్ నాగుల్ మీరా, మేష్ నాయక్, షేక్ బాబు శూన్యంపహాడ్ గ్రామ పార్టీ అధ్యక్షులు అశోక్ నాయక్, జన్పహాడ్ దర్గా గ్రామ పార్టీ అధ్యక్షులు రాజశేఖర్, రమేష్ నాయక్, రవి నాయక్ సాయి చరణ్, సైదులు, కిషోర్, తవ్రియ వెంకటేశ్వర్లు వి. కిరణ్ టోనీ జోసెఫ్ పాల్గొన్నారు.

# ఉచిత త్రాగునీరు చలివేంద్రం ప్రజల దాహార్తి తీర్చుతుంది

## చలివేంద్రంను ప్రారంభించిన జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్



ములుగు, మార్చి 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క సూచన మేరకు మంగపేట మండల కేంద్రంలోని వైయస్సార్ సెంటర్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్ర కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దలు పైడకుల అశోక్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చలివేంద్రం అనేది ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేయబడిన ఉచిత మంచినీటి కేంద్రం కొత్త కొండలలో మంచి నీటిని నింపడం వలన ఈ నీరు చల్లగా ఉంటుంది వేసవికాలంలో ప్రజలకు ఎక్కువగా దాహం వేసే ఈ వేసవికాలంలో మంగపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల సీనియర్ నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు విషయంలో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఊరుకోం

**ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దళితులకు అండగా ఉంది**

**చిల్లర రాజకీయాలకు పాల్పడినవారిని గుర్తించి తగిన బుద్ధి చెప్పాలి**

**ఎస్సీ సెల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి**




ములుగు, మార్చి 13 (తీన్మార్ న్యూస్): కొంతమంది దళిత నాయకులు బీఆర్ఎస్ పార్టీ అమలుచేసిన దళిత బంధు పథకాన్ని ఆసరాగా చేసుకుని సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని దళిత బంధు కు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు అన్నారు. ఇక ముందు లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. %దీ%ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ అభయహస్తం పథకం అమలు తీరుపై కసరత్తు జరుగుతుందన్నారు త్వరలో లబ్దిదారులకు చేకూరే విధంగా ప్రభుత్వం చొరవ తొలుసుకుంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణకు కమిటీని ఏర్పాటు చేసి రిజర్వేషన్ అమలుకు పోరాడుతున్న ప్రభుత్వంపై లేని పోని అభాండాలు వేస్తే భవిషత్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుద్ధి చెప్పక తప్పదన్నారు. గత ప్రభుత్వం హయాంలో తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని నిరుపేద దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని మోసం చేసిన ఘనత మాజీ సిఎం కేసీఆర్ ది బీ ఆర్ ఎస్ పార్టీది అని అన్నారు. ఈ విషయాన్ని దళిత సోదరులు గమనించాలని దళిత బంధు సాధన సమితి పేరుతో దళిత నిరుపేదల ముందుకు కొంత మంది మోసగాళ్ళు వస్తున్నారని దళితుల దగ్గవ డబ్బులు వసూలు చేసి పబ్బ గడుపుతున్నారని మోసగాళ్ల వ్యూహాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది తప్ప ఎవరినీ ఇబ్బంది పెట్టదని ఈ విషయాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారు అని అన్నారు. మా కాంగ్రెస్ పార్టీ నాయకులపై నిరాదారణమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ గారు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కన్ను రవి మ్, మాధరపు రాజు, కొమురయ్య, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతం

**న్యూఢిల్లీ:** అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన విషయం తెలిసిందే. భవిష్యత్‌లో చేపట్టబోయే భారీ అంతరిక్ష యాత్రలకు అవసరమైన ఈ కీలక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టిన ఇస్రో ఆ దిశగా మరో అడుగు వేసింది. తాజాగా స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించింది. దీనిపై అంతరిక్ష సంస్థకు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ శుభాకాంక్షలు తెలియజేశారు. "ఈ విజయం ప్రతి భారతీయుడిలో ఉత్సాహాన్ని నింపుతుంది. నమ్మశక్యం కాని డీ డాకింగ్ ప్రక్రియను స్పేడెక్స్ శాటిలైట్లు పూర్తి చేశాయి. భారతీయ అంతరిక్ష స్టేషన్, చంద్రయాన్-4, గగన్‌యాన్ సహా భవిష్యత్ ప్రయోగాలకు మార్గాన్ని సుగమం చేసింది" అని మంత్రి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్‌లో భాగంగా ఇస్రో.. గతేడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో ఈ ప్రయోగాలను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది. మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ వి.నారాయణన్ ఇటీవల వెల్లడించారు.

# ఎక్స్ఛేంజీ పెట్టి రూ.8 లక్షల కోట్ల క్రిప్టో మోసం

**కేరళలో చిక్కిన నిందితుడు**



**న్యూఢిల్లీ :** క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజీ పెట్టి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన కేటుగాడు ఎట్టకేలకు చిక్కాడు. అమెరికాలో భారీ క్రిప్టో మోసానికి పాల్పడి పరారీలో ఉన్న లిథువేనియా దేశస్థుడిని కేరళ పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. రూ.8 లక్షల కోట్ల క్రిప్టో మోసానికి సంబంధించి నిందితుడు అలెక్సెజ్ బెస్కియోకోవ్ అమెరికాలో వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. లిథువేనియాకు చెందిన అలెక్సెజ్ కొన్నేళ్ల కిందట 'గారంటెక్స్' పేరుతో క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజీని ఏర్పాటుచేసినట్లు యూఎస్ సీక్రెట్ సర్వీస్ డాక్యుమెంట్లు వెల్లడించాయి. దీనిద్వారా కంప్యూటర్ హ్యాకింగ్, నార్కోటిక్స్ లావాదేవీలు, రాన్సమ్‌వేర్ వంటి మోసాలకు పాల్పడేవాడు. "నిబంధనలను ఉల్లంఘించి ఈ ఎక్స్ఛేంజీలో అంతర్జాతీయ నేర సంస్థలు, ఉగ్ర ముఠాల క్రిప్టో లావాదేవీలను నిర్వహించేవాడు. ఇందుకుగానూ అతడు వందల మిలియన్ల డాలర్లను అందుకున్నాడు. అలా వచ్చిన డబ్బుతో డ్రగ్స్ అక్రమ రవాణా, హ్యాకింగ్, సైబర్ నేరాలకు పాల్పడ్డాడు" అని అమెరికా దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు అతడు 96 బిలియన్ డాలర్ల మేర (భారత కరెన్సీలో దాదాపు రూ.8.3 లక్షల కోట్లు) మోసానికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో అగ్రరాజ్యంలో అలెక్సెజ్‌పై అనేక కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్‌లో అమెరికా అతడిపై ఆంక్షలు విధించింది. అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. అతడు భారత్‌లో ఉన్నట్లు తెలుసుకున్న యూఎస్ అధికారులు.. కేంద్ర విదేశాంగశాఖను సంప్రదించారు. అనంతరం ప్రొవిజినల్ అరెస్టు వారెంట్ జారీచేయగా.. సీబీఐ, కేరళ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టి తిరువనంతపురంలో నిందితుడు అలెక్సెజ్‌ను అరెస్టు చేశారు. అతడు భారత్ వదిలి మరో దేశానికి పారిపోయేందుకు సిద్ధమవుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రమాదంలో 85లక్షల మంది విద్యార్థుల భవిత

**పేపర్ లీకేజీలపై రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ :** ప్రశ్నాపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ అగ్రనా యకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి స్పందిం చారు. ఈ లీక్‌ల కారణంగా కష్టపడి చదివే విద్యార్థులు ఆందోళనకు గురవు తున్నారన్నారు. దీనిపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రశ్నాపత్రాల లీకులతో 6 రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి కారణంగా కష్టపడి చదివే పిల్లలతో పాటు వారి కుటుంబాలు ఒత్తిడికి గురవుతున్నాయి. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదు. దీని వల్ల కష్టపడి పనిచేయడం కంటే నిజాయితీగా లేకపోవడమే మంచిదనే తప్పుడు సందేశం భవిష్యత్తు తరాలకు వెళ్తుంది. అది ఆమోదయోగ్యం కాదు. నీట్ పేపర్ లీక్ దేశాన్ని కుదిపేసి ఏడాది కూడా కాలేదు. దీనిపై మేము పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తంచేశాం. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది. ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కనబెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి' అని రాహుల్ రాసుకొచ్చారు. పేపర్‌లీక్‌లపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ పోస్టు చేశారు.

# డిమాండ్లు పాతవే.. అయినా వెల్లడించని రష్యా



**వాషింగ్టన్ :** ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్నా.. అమెరికాతో సంబంధాలు పునరుద్ధరించాలన్నా తీర్చాల్సిన డిమాండ్ల లిస్టును రష్యా బయటపెట్టింది. నేడు వాటిని వాషింగ్టన్‌కు అందజేసింది. కాకపోతే ఆ డిమాండ్లు ఏమిటనేది మాత్రం బయటకు వెల్లడించలేదు. గత మూడు వారాల నుంచి అమెరికా-రష్యా అధికారులు వర్చువల్ విధానంలో చర్చలు జరుపుతున్నారు. కాకపోతే మాస్కో పంపిన డిమాండ్లలో చాలావరకు గతంలో ఉక్రెయిన్‌కు అందించినవే ఉన్నట్లు తెలుస్తోంది. వీటిల్లో కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, విదేశీ దళాలను ఉక్రెయిన్‌లోకి అనుమతించకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్స్‌లు రష్యాకు చెందుతాయని అంగీకరించడం వంటివి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతోపాటు అసలు యుద్ధానికి మూలకారణమైన నాటో తూర్పువైపు విస్తరణ అంశం కూడా పరిశీలించాలని కోరే అవకాశం ఉంది. మరోవైపు 30 రోజుల కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా ప్రతిస్పందన కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటికే యుద్ధం ఆపడంలో తొలి అడుగుగా.. జెలెన్‌స్కీ ఈ డిమాండ్‌ను ఆమోదించిన విషయం తెలిసిందే. కాకపోతే పుతిన్ నుంచి మాత్రం ఎటువంటి సంకేతాలు వెలువడలేదు. ఈ చర్చలను అడ్డంపెట్టుకొని అమెరికా-ఉక్రెయిన్-ఐరోపాను వేరు చేయడానికి రష్యా అధ్యక్షుడు ప్రయత్నిస్తారనే భయాలు వాషింగ్టన్ బృందంలో ఉన్నాయి. మరోవైపు తమ డిమాండ్ల విషయంలో వాషింగ్టన్‌లోని రష్యా దౌత్య కార్యాలయం స్పందించేందుకు నిరాకరించింది. తాజాగా ఈ అంశంపై బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఏంజెలా స్టెంట్ మాట్లాడుతూ డిమాండ్లలో ఎటువంటి మినహాయింపులు ఇచ్చేందుకు రష్యన్లు సిద్ధంగా లేనట్లు కనిపిస్తోందన్నారు. గతంలో పలుమార్లు అమెరికా తిరస్కరించిన డిమాండ్లనే మళ్లీ చేస్తోంది. దీంతో మాస్కో శాంతి, అర్థవంతమైన చర్చలకు ఆసక్తిగా లేదని తెలుస్తోందన్నారు.

# రిపోర్టర్ల ఎదుటే జేడీ వాన్స్‌ను ట్రోల్ చేసిన ట్రంప్



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వస్త్రధారణ చాలాకాలంగా నెట్టింట ట్రోలింగ్‌కు గురవుతోంది. తాజాగా ఆయన్ను ట్రోల్ చేసే వారి జాబితాలోకి అధ్యక్షుడు ట్రంప్ కూడా చేరిపోయారు. శ్వేతసౌధంలో ఓ దేశాధినేత, రిపోర్టర్ల ఎదుటే వాన్స్‌ను ఆట పట్టించారు. ఐరిష్ ప్రధాని మైఖెల్ మార్టిన్ బుధ వారం వైట్‌హౌస్‌ను సందర్శించారు. అనంతరం ఆయన సెయింట్ పాట్రిక్స్ డే వార్షిక సంబరాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ట్రంప్, వాన్స్‌తో ఓవల్ ఆఫీస్‌లో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ట్రంప్ ద్రవ్యోల్బణం గురించి మాట్లాడబోతూ.. హఠాత్తుగా జేడీ వాన్స్ వేసుకొన్న సాక్స్ వైపు చూస్తూ.. "ఈ సాక్స్ నాకు నచ్చాయి. ఏంటీ సాక్సులు" అని హఠాత్తుగా వాన్స్‌ను ట్రోల్ చేశారు. దీంతో అక్కడున్నవాళ్లంతా నవ్వడం మొదలుపెట్టారు. "నేను ఏకాగ్రతగా ఉందామనుకొంటున్నాను.. వాన్స్ సాక్స్‌లు నన్ను ఆకర్షించాయి" అని వ్యాఖ్యానించారు. వాన్స్ యాక్సెసరీస్ ఎంపికను ట్రంప్ మెచ్చుకొన్నారు. వాన్స్ తెల్లరంగు సాక్సులపై షామ్రాక్ ఆకుల డిజైన్లు ఉండటం ట్రంప్‌ను ఆకర్షించింది. వాస్తవానికి వాన్స్ ధరించే పొట్టి ప్యాంట్లపై ఇంటర్నెట్‌లో చాలాకాలంగా చర్చ జరుగుతోంది. గత నెల కూడా వాన్స్ డ్రెస్సింగ్ విధానం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆయన 1700ల్లో నాటి ఆంగ్లేయులు ధరించే వస్త్రాలు, స్టాకింగ్స్‌ను ధరిస్తారని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. "పొడుగు ప్యాంట్లు, పిక్కల పైకి సాక్సులు ధరించాలని సెకండ్ లేడీ సూచించాలని" పేర్కొన్నారు. ఇక ట్రంప్ కూడా ద్రవ్యోల్బణంపై చర్చను వాన్స్ సాక్స్ పైకి మళ్లించిన తర్వాత.. ఇక ఆ అంశాన్ని మళ్లీ మాట్లాడలేదు. ట్రంప్ కెనడా, మెక్సికో, చైనాతో మొదలుపెట్టిన వాణిజ్యయుద్ధం కారణంగా ద్రవ్యోల్బణం పెరగొచ్చనే భయాలు అమెరికాలో ఉన్నాయి. దీనికితోడు ఆర్థిక మాంద్యం కూడా వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# సుచిర్ బాలాజీ మృతి..

**చనిపోయే కొన్ని నిమిషాల ముందు సీసీటీవీ దృశ్యం బయటకు**

**న్యూఢిల్లీ :** చాట్‌జీపీటీ మాతృ సంస్థ 'ఓపెన్ ఏఐ'లో నాలుగేళ్లు పరిశోధకుడిగా పనిచేసిన ప్రజా వేగు (విజిల్ బ్లోయర్), భారత సంతతి వ్యక్తి సుచిర్ బాలాజీ (26) గతేడాది అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అతడి మరణానికి ముందు సీసీటీవీలో రికార్డయిన ఫొటోను సుచిర్ తల్లి పూర్ణిమారావు పంచుకున్నారు. ఆ ఫొటోలో అతడు ఫుడ్ పార్శిల్ పట్టుకొని లిఫ్ట్ ఎక్కుతున్నట్లు కనిపిస్తుంది. 'సుచిర్ చనిపోయిన రోజు రాత్రి 7:30 నిమిషాలకు సంబంధించిన ఫొటో ఇది. చీఫ్ మెడికల్ ఎగ్జామినర్ కార్యాలయం ఈ వీడియోను చూసింది. అయినప్పటికీ.. అతడు నిరాశకు లోనయ్యాడని, ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధరించారు. అంతేకాదు.. అతడు చనిపోయిన 3 రోజుల తర్వాత నిర్వహించిన శవపరీక్షలో డ్రగ్ మోతాదు ఎక్కువగా ఉందని తెలిపారు. అయితే, అది తప్పని మేము చేయించిన రిపోర్టులో వెల్లడైంది. దీనిపై టాక్సికాలజిస్ట్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నాం' అని పూర్ణిమారావు పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. సుచిర్ హత్యకు దీర్ఘకాలంగా ప్రణాళికలు రచించినట్లు ఆమె మరో పోస్టులో ఆరోపించారు. అతడు నివసించే అపార్టుమెంటు గ్యారేజీలో, ఎలివేటర్‌లో ఎలాంటి సీసీటీవీలు లేవని, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నా అవి పనిచేయడం లేదని తెలిపారు. ఇక, శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో గతేడాది నవంబర్ 26న బాలాజీ మృతి చెందాడు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు దీన్ని ఆత్మహత్యగా పేర్కొన్నారు. దీనిపై అతడి తల్లి పూర్ణిమారావు న్యాయపోరాటానికి దిగారు. తన కుమారుడి మరణంపై అనుమానాలు వ్యక్తంచేస్తూ ప్రైవేట్ ఇన్వెస్టిగేటర్‌ను నియమించుకొని రెండోసారి శవపరీక్ష చేయించారు. అయితే ఆ ఫలితాలు పోలీసులు తెలిపిన దానికి భిన్నంగా ఉన్నట్లు ఆమె వెల్లడించారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని పోలీసులు తమతో పేర్కొన్నట్లు పూర్ణిమా వెల్లడించారు. ఆ దృశ్యాల కోసం అపార్టుమెంటు సిబ్బందిని ఎవరూ సంప్రదించలేదని తెలిసిందని ఆమె పేర్కొనడం గమనార్హం. మరోవైపు.. సుచిర్ మృతిపై ఆ టెక్ సంస్థ సైతం స్పందించింది. అతడి మరణం తమను ఎంతో కలచివేసిందని సామాజిక మాధ్యమ వేదికగా పోస్ట్ పెట్టింది. ఈ కేసులో అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

# సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం



మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ దాదాపు తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. ఆమెతో పాటు వెళ్లిన బచ్ విల్మోర్ కూడా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈక్రమంలో వారిని భూమిపైకి తిరిగి తీసుకొచ్చేందుకు నాసా-స్పేస్‌ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ 10 మిషన్ వాయిదా పడింది. అమెరికా లోని ఫ్లోరిడా నుంచి నలుగురు వ్యోమగాములతో ఫాల్కన్ 9 రాకెట్ బయలుదేరేందుకు క్రూ 10 మిషన్ సిద్ధమైంది. ఈక్రమంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం నిలిచిపోయింది. హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య ఉత్పన్నం కావడంతో దీన్ని ఆపేసినట్లు నాసా పేర్కొంది. సమస్యను పరిష్కరించి ఈ వారంలో మరో ప్రయోగం చేయనున్నట్లు తెలిపింది. దీంతో వ్యోమగాముల రాక మరికొన్ని రోజులు ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో వారు ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రణాళిక ప్రకారం ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. సునీతా విలియమ్స్, విల్మోర్ అప్పటినుంచి ఐఎస్ఎస్‌లోనే ఉంటున్నారు. వారిని తిరిగి తీసుకురావడానికి నాసా స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఈ ఇద్దరు వ్యోమగాములను తీసుకురావాలంటే అంతకంటే ముందు కొందరిని ఐఎస్ఎస్‌కు పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రయోగం చేపట్టడానికి స్పేస్ ఎక్స్ సమయం కావాలనడంతో ఈ ఆలస్యం జరిగిందని గతంలో అధికారులు పేర్కొన్నారు. ఇక సునీత విలియమ్స్, విల్మోర్ కొన్ని రోజుల క్రితం స్పేస్ నుంచి మీడియాతో మాట్లాడారు. తమకోసం మార్చి 12న స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ-10 అంతరిక్షనౌక రానుందని, నౌకలో కొత్తగా ఐఎస్ఎస్‌లోకి వచ్చే వ్యోమగాములు తమ బాధ్యతలు తీసుకోనున్నారని చెప్పారు. తర్వాత మార్చి 19న ఆ నౌకలోనే తిరిగి భూమి మీదకు తాము బయల్దేరనున్నామని తెలిపారు.

# రైళ్లలో మెనూ ప్రదర్శన తప్పనిసరి : అశ్వినీ వైష్ణవ్




**న్యూఢిల్లీ :** రైళ్లలో అందించే ఆహార పదార్థాల మెనూ, ధరల పట్టిక వివరాలు ప్రయాణికులకు తెలియజేసేలా ప్రదర్శించడం తప్పనిసరి అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభకు తెలిపారు. ప్రయాణికుల సమాచారం కోసం రైళ్లలో అందు బాటులో ఉన్న ఆహార పదార్థాల మెనూ కార్డు, ధరలు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉన్నాయని, ముద్రించిన మెనూ కార్డులు వెయిటర్ల వద్ద అందుబాటులో ఉంచామని, ప్రయాణికులు అడిగితే వాటిని అందిస్తామని ఆయన లిఖిత పూర్వకంగా సభకు తెలియజేశారు.

# ఈయూ సుంకాలు పెంచితే.. నేను ఇంకా ముందుకెళ్తా : ట్రంప్

ఉక్కు, అల్యూమినియంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఐరోపా కూటమి (ఈయూ) సైతం అగ్రరాజ్యంపై 28 బిలియన్ డాలర్ల (26 బిలియన్ యూరోలు) సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రతీకార సుంకాలపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈయూ మా దగ్గర వసూలు చేసినంతే తాము వసూలు చేస్తామని విలేకరులతో పేర్కొన్నారు. 'వాళ్లు మా దగ్గరం ఎంత వసూలు చేస్తే.. మేము కూడా వాళ్ల దగ్గరనుంచి అంతే వసూలు చేస్తాం' అని ట్రంప్ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్ వస్తువులపై మరిన్ని సుంకాలు విధించి ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని తెస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇక, త్వరలో రాగిపై కూడా ట్రంప్ సుంకాలు విధించనున్నారని వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఉక్కు, అల్యూమినియంపై 25 శాతం సుంకాలు అమల్లోకి వచ్చాయని ట్రంప్ బుధవారం ప్రకటించారు. దీనివల్ల అమెరికాలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు వస్తాయని ఆయన తెలిపారు. ట్రంప్ నిర్ణయాన్ని ఈయూ వెంటనే తిప్పికొట్టింది. అమెరికా 28 బిలియన్ డాలర్ల సుంకాలను విధించిందని, తాము అంతే స్థాయిలో దానిపై 28 బిలియన్ డాలర్ల సుంకాన్ని విధిస్తున్నామని ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్ లెయెన్ ప్రకటించారు.

# యూట్యూబ్ చూసి గోల్డ్ స్మగ్లింగ్ నేర్చుకున్నా

**నటి రన్యారావు సంచలన విషయాలు**



**న్యూఢిల్లీ :** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఆమెను కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. విచారణ సందర్భంగా ఆమె పలు విషయాలను వెల్లడించి నట్లు తెలుస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి నుంచి తనకు కాల్స్ వచ్చాయని, యూట్యూబ్ వీడియోలు చూసి స్మగ్లింగ్ చేయడం నేర్చుకున్నానని ఆమె వాంగ్మూలంలో పేర్కొన్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. "గత రెండు వారాలుగా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి నాకు కాల్స్ వచ్చాయి. మార్చి 1న ఓ విదేశీ ఫోన్ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. దుబాయ్ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్ 3 వద్ద ఉన్న గేట్ ఏ వద్దకు వెళ్లాలని సూచించారు. అక్కడ బంగారం తీసుకుని బెంగళూరులో డెలివరీ చేయాలని చెప్పారు. దుబాయ్ నుంచి ఇంతకు ముందెన్నడూ బంగారాన్ని అక్రమంగా తీసుకురాలేదు. స్మగ్లింగ్ చేయడం ఇదే మొదటిసారి" అని రన్యా రావు అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. "రెండు ప్లాస్టిక్ కవర్లలో బంగారాన్ని ఇచ్చారు. దాన్ని దాచడం కోసం బ్యాండేజ్‌లు, కత్తెరలను ఎయిర్‌పోర్టులో కొన్నాను. ఆ తర్వాత రెస్ట్‌రూమ్‌కు వెళ్లి ఆ బంగారం కడ్డీలను నా శరీరానికి అతికించుకున్నా. జీన్స్, బూట్లలో దాచిపెట్టా. ఇదంతా యూట్యూబ్ వీడియోలు చూసి నేర్చుకున్నా" అని నటి వాంగ్మూలంలో పేర్కొన్నారు. అయితే, కాల్ చేసిన వ్యక్తి ఎవరన్న విషయం మాత్రం తనకు తెలియదని చెప్పారు. అతడి భాష చూస్తే ఆఫ్రికన్-అమెరికన్‌లా అనిపించిందన్నారు. ఆ బంగారం ఎవరికి ఇవ్వాలో కూడా తనకు తెలియదని నటి చెప్పారు. "ఎయిర్‌పోర్టు టోల్ గేట్ నుంచి బయటకు వచ్చాక సర్వీస్ రోడ్డులో వెళ్లమని నాకు సూచించారు. అక్కడ సిగ్నల్ దగ్గర ఆగి ఉన్న ఆటోలో పెట్టి వెళ్లిపోవాలని చెప్పారు. ఆ వ్యక్తి ఎవరనేది నాకు తెలియదు" అని రన్యారావు అధికారులకు తెలిపారు. ఫొటోగ్రఫీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే తాను పలుమార్లు దుబాయ్‌కు వెళ్లినట్లు ఆమె చెప్పారు. గతంలో యూరప్, ఆఫ్రికా, అమెరికాకు కూడా అనేకసార్లు వెళ్లానని పేర్కొన్నారు. ఈ వివరాలపై డీఆర్ఐ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆమె ఫోన్, ల్యాప్‌టాప్‌లో ఉన్న డేటా ఆధారంగా స్మగ్లింగ్ సిండికేట్ నంబర్లను ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

# స్నేహితుడి కోసం వచ్చి..

**అతడి చేతిలో అత్యాచారానికి గురైన బ్రిటిష్ మహిళ**



**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా వేదికగా పరిచయమైన స్నేహితుడి మాయమాటలు నమ్మి, అతడిని కలిసేందుకు ఓ యువతి బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చింది. ఇక్కడికి వచ్చిన ఆమె అతడి చేతిలోనే ఘోరంగా మోసపోయింది. హొటల్ గదిలో అత్యాచారానికి గురైంది. దిల్లీలో మహిపాల్‌పుర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. దిల్లీలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న కైలాశ్‌కు బ్రిటన్‌కు చెందిన మహిళతో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. అతడిని చూసేందుకు ఇటీవల ఆమె భారత్‌కు వచ్చింది. మహిపాల్‌పుర్‌లోని ఒక హొటల్ గదిని బుక్ చేసుకుంది. ఆమెను కలిసేందుకు వచ్చిన కైలాశ్.. మహిళతో అభ్యంతరకరంగా వ్యవహరించాడు. మరో స్నేహితుడితో కలిసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారి నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. తొలుత కైలాశ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, అక్కడి నుంచి తప్పించుకొని రిసెప్షన్ వద్దకు చేరుకునేందుకు లిఫ్ట్ ఎక్కిన తనను అతడి స్నేహితుడు లైంగికంగా వేధించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. భారత్‌కు వచ్చిన ఆ మహిళ తొలుత మహారాష్ట్ర, గోవాల్లో పర్యటించింది. కైలాశ్‌ని కూడా అక్కడికి రమ్మని అడిగింది. అయితే తాను రాలేనని చెప్పి, ఆమెనే దిల్లీకి రావాలని కోరాడు. ఆమెతో ఇంగ్లిష్‌లో మాట్లాడేందుకు ఇబ్బందిపడిన కైలాశ్.. గూగుల్ ట్రాన్స్‌లేట్ వాడినట్లు బాధితురాలు ఫిర్యాదులో వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఘటనను భారత్‌లోని బ్రిటన్ హైకమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కర్ణాటకలో కూడా ఇదేతరహా ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కొప్పళ జిల్లాలో కొందరు నిందితులు విదేశీ పర్యటకులపై దాడి చేసి, ముగ్గురిని కాల్వలోకి తోసి, ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడిన సంగతి తెలిసిందే. నదిలో పడినవారిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అత్యాచారానికి గురైన వారిలో ఇజ్రాయెల్‌కు చెందిన మహిళ ఉందని పోలీసులు తెలిపారు.

# రోహిత్ టార్గెట్ అదేనా?

## అప్పటి వరకు 'నో రిటైర్‌మెంట్'




టీ20 ప్రపంచ కప్ గెలిచాడు. ఛాంపియన్స్ ట్రోఫీని అందించాడు. ఇప్పటికే పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పేశాడు. ఇప్పుడు వన్డేలకూ గుడ్‌బై చెబుతాడని అంతా భావించారు. కానీ, రిటైర్‌మెంట్ తీసుకోవడం లేదంటూ స్పష్టంచేసేశాడు. ఆ ఆటగాడు ఎవరనేది ఇప్పటికే అర్థమైపోయిందిగా. అతడే.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ. ఈ క్రమంలో వన్డే ప్రపంచకప్ 2027 వరకూ ఉంటాడని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025-27) ఫైనల్‌లోనూ ఆడాలనేది అతడి అభిమతంగా ఉందనేది వారి అంచనా. "రోహిత్ అనుకున్నవిధంగా భావిస్తే మాత్రం అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ మరో రెండేళ్లపాటు కొనసాగే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా-జింబాబ్వే-నమీబియా ఆతిథ్యంలో వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీ జరగనుంది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా అదే ఏడాది ఉంది. ఈ రెండింటిని గెలిచి ఘనంగా కెరీర్‌కు వీడ్కోలు పలకాలనేది రోహిత్ భావన" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

### ఐపీఎల్ తర్వాతే ఓ నిర్ణయం..

రోహిత్ శర్మ మరో నెల రోజుల్లో 38వ సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నాడు. 2027 నాటికి అతడికి 40 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు కొనసాగాలంటే ఫిట్‌నెస్‌తోపాటు బ్యాటింగ్‌లో ఫామ్ అత్యంత కీలకం. టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌తో కలిసి రోహిత్ పనిచేయనున్నట్లు తెలుస్తోంది. రాబోయే రెండేళ్లలో భారత్ 27 వన్డేలు ఆడే అవకాశం ఉంది. దినేశ్ కార్తిక్ నుంచి కేఎల్ రాహుల్ వరకు నాయర్ కోచింగ్‌పై మంచి గురి ఉంది. రోహిత్‌తో కలిసి ఆడిన అనుభవం ఉంది. అయితే, టెస్టు భవిష్యత్తుపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. గత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో రోహిత్ ప్రదర్శన గొప్పగా ఏమీ లేదు. దీంతో ఐపీఎల్ ముగిసిన తర్వాత టెస్టు కెరీర్‌పై రోహిత్ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఇంగ్లాండ్‌తో జూన్‌లో టెస్టు సిరీస్ జరగనుంది. అప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ మొదలవుతుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకోవాలంటే భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకం.




# ఆ మ్యాచ్ వచ్చిందంటే..

## ధోనీ పక్కనే ఉండాలనుకుంటా : సంజు శాంసన్

భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీతో ఎప్పుడూ ఉండాలని.. అతడి ఆలోచనలను తీసుకొని కెరీర్‌లో ఉన్నత స్థానాలకు వెళ్లాలనేదే తన ఆకాంక్ష అంటూ భారత ఆటగాడు, రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2025 సీజన్ మరో పది రోజుల్లోపే ప్రారంభం కానుంది. సంజు శాంసన్, ఎంఎస్ ధోనీ కలిసి ఓ అడ్వటైజ్‌మెంట్‌లోనూ కలిసి నటించిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడే ప్రతి సందర్భంలోనూ ధోనీతో కలిసి ముచ్చటించేందుకు ఆసక్తి చూపిస్తానని సంజు తెలిపాడు. తొలిసారి షార్జా వేదికగా 2020 సీజన్‌లో ధోనీతో మాట్లాడిన తర్వాత తమ మధ్య బంధం బలపడినట్లు వెల్లడించాడు. "ప్రతి యువ క్రికెటర్ మాదిరిగానే నేను కూడా ఎంఎస్ ధోనీ పక్కన ఉండేందుకు ఇష్టపడతా. సీఎస్కేతో మ్యాచ్ అనంతరం ధోనీ పక్కనే కూర్చొని మాట్లాడేవాడిని. వ్యక్తిగత విషయాలూ అడిగేవాడిని. అదెలా ఉంటుందంటే కల నిజమైనట్లుగా భావించేవాడిని. నాకు ఇప్పటికీ ఓ మ్యాచ్ గుర్తుంది. షార్జాలో చెన్నైపై 70ం పరుగులు చేశా. ఆ మ్యాచ్‌లో మేం గెలిచాం. నాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వచ్చింది. ఆ తర్వాత మహీ భాయ్‌ను కలిశా. అప్పట్నుంచి మా రిలేషన్ బలపడింది. ఇప్పటికీ తరచూ అతడిని కలుస్తూ ఉంటా. రెండు రోజుల కిందటే కలిశా. నిజంగా మ్యాచ్‌లతోపాటు షూటింగ్స్ కోసం అతడితో భేటీ కావడం నిజంగా అద్భుతమనిపిస్తోంది. నేను ఇప్పటికీ కలలోనే బతికేస్తున్నానేమో అనుకుంటా" అని సంజు శాంసన్ వెల్లడించాడు.

### సన్‌రైజర్స్‌తో తొలిపోరు

ఐపీఎల్ 18వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తమ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్‌ను గువాహటి వేదికగా మార్చి 30న ఢీకొట్టనుంది. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో భాగంగా చివరి మ్యాచ్ సందర్భంగా సంజు శాంసన్‌కు గాయమైంది. దీంతో అతడు క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. చిన్నపాటి శస్త్రచికిత్స చేయించుకోవడంతో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌లో ఆడలేదు. ఇప్పుడు దానినుంచి కోలుకుని ఐపీఎల్ కోసం సిద్ధమయ్యాడు.



## పాక్ క్రికెట్ స్థాయి ఏంటో ఐసీసీ ఈవెంట్‌లో ప్రతిబింబించింది : కమ్రాన్ అక్మల్

పాకిస్థాన్ ఆతిథ్యంలోనే ఛాంపియన్స్ ట్రోఫీ జరిగింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన టీమ్‌ఇండియా విజేతగా నిలిచింది. కానీ, కప్‌ను అందించే ప్రెజెంటేషన్ కార్యక్రమంలో మాత్రం పీసీబీ నుంచి ఒక్క ప్రతినిధికీ అవకాశం దక్కలేదు. పీసీబీ ఛైర్మన్ మోసిన్ నక్వీ పార్లమెంట్ సమావేశాల వల్ల వెళ్లలేకపోయారు. సీఓఓ సుమైర్ అహ్మద్ దుబాయ్‌లోనే ఉన్నప్పటికీ.. పోడియం మీదకు మాత్రం ఆహ్వానించలేదు. దీనిపై చాలా విమర్శలు వచ్చినా ఐసీసీ మాత్రం స్పష్టమైన సమాధానమే ఇచ్చింది. పోడియంపై ఛైర్మన్ లేదా ఆఫీస్ బేరర్ స్థాయి వారినే ఆహ్వానించామని.. మిగతావారికి అవకాశం ఇవ్వలేదని పేర్కొంది. ఈక్రమంలో పాక్ క్రికెట్ బోర్డుకు అసలు అర్హతే లేదని ఆ జట్టు మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ వ్యాఖ్యానించాడు. ఇదే విషయం ఐసీసీ కార్యక్రమంలో ప్రతిబింబించిందని తెలిపాడు. "మన స్థాయి ఏంటనేది అద్దంలో ఐసీసీ చూపించింది. టోర్నమెంట్ డైరెక్టర్ అక్కడే ఉన్నారు. అతడు అందుబాటులోనే ఉన్నప్పటికీ ప్రెజెంటేషన్ కార్యక్రమంలోకి ఎందుకు పోడియం మీదకు వెళ్లలేకపోయాడు? ఎందుకంటే మనకు అర్హత లేదు కాబట్టే. మనం నాణ్యమైన క్రికెట్ ఆడలేదు. ఇతర జట్లకు మనమేంటో ప్రత్యక్షంగా చూపించినట్లైంది. పాకిస్థాన్ టోర్నీని ఎలా నిర్వహించిందని ఎవరూ మాట్లాడుకోవడం లేదు. అదే మనం అద్భుతమైన క్రికెట్ ఆడుంటే.. పరిస్థితి విభిన్నంగా ఉండేది. కేవలం స్వార్థంతో ఆడితే గౌరవం దక్కదనడానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ" అని కమ్రాన్ అక్మల్ తెలిపాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాక్ కనీసం ఒక్క విజయం కూడా లేకుండానే గ్రూప్ స్టేజ్ నుంచి వైదొలిగింది. భారత్, న్యూజిలాండ్ చేతుల్లో ఓటమిని చవిచూసిన పాక్.. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైన సంగతి తెలిసిందే.

# రోహిత్ శర్మను విమర్శించడానికి ఒక్క కారణమూ లేదు

### ఏబీ డివిలియర్స్



టీమ్‌ఇండియాకు వరుసగా రెండో ఐసీసీ టైటిల్ అందించిన రోహిత్ శర్మపై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ప్రశంసలు కురిపించాడు. ఇతర కెప్టెన్లతో పోలిస్తే అతని రికార్డు చాలా మెరుగ్గా ఉందని, బ్యాటర్‌గానూ రాణిస్తున్నాడని పేర్కొన్నాడు. రోహిత్ రిటైర్ కావడానికి, అతడిని విమర్శించడానికి ఒక్క కారణమూ లేదని ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత రోహిత్ శర్మ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని ప్రచారం జరిగింది. అయితే, ఫైనల్ మ్యాచ్ అనంతరం హిట్‌మ్యాన్ దీనిపై స్పందించాడు. తన రిటైర్మెంట్ గురించి ఎలాంటి ప్రచారం చేయొద్దని, వన్డే ఫార్మాట్ నుంచి ఇప్పుడే తాను రిటైర్ కావట్లేదని స్పష్టత ఇచ్చాడు. ఈ నేపథ్యంలోనే పలువురు క్రికెటర్లు రోహిత్ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా నిలుస్తున్నారు. 'ఇతర కెప్టెన్లతో పోల్చి చూస్తే రోహిత్ విన్నింగ్ పర్సంటేజీ ఎక్కువ. అది దాదాపు 74 శాతంగా ఉంది. ఇది గతంలోని ఇతర కెప్టెన్ల కంటే చాలా ఎక్కువ. అతను మరింత కాలం ఆడితే ఆల్‌టైమ్ వన్డే కెప్టెన్లలో ఒకడిగా నిలుస్తాడు. రోహిత్ కూడా తాను రిటైర్ కావడం లేదని చెప్పాడు. దీనిపై వదంతులు వ్యాప్తి చేయడం ఆపాలని కోరాడు. రోహిత్ ఎందుకు రిటైర్ కావాలి? అతనికి కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ మంచి రికార్డు ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో 76 పరుగులు చేసి గొప్ప శుభారంభాన్ని అందించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తీవ్ర ఒత్తిడిలోనూ మంచి నిర్ణయాలు తీసుకుని జట్టును విజయపథంలో నడిపించాడు. రోహిత్ రిటైర్ అవ్వడానికి, అతణ్ని విమర్శించేందుకు ఒక్క కారణమూ లేదు. అతని రికార్డులే అతను ఎంత గొప్ప ఆటగాడో చెప్తాయి. అంతే కాదు, రోహిత్ తన ఆటను కూడా మార్చుకున్నాడు. గతంలో కంటే పవర్‌ప్లేలో అతని స్ట్రైక్ రేట్ పెరిగింది' అని ఏబీ డివిలియర్స్ పేర్కొన్నాడు.

# అఫ్రిది నన్ను మారిపోమన్నాడు.. నా కెరీర్ నాశనమైంది : డానిష్ కనేరియా



పాకిస్థాన్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పాక్‌లో వివక్షను ఎదుర్కొన్నట్లు పేర్కొన్న అతడు.. తన కెరీర్ నాశనం కావడానికి అదే ప్రధాన కారణమని వ్యాఖ్యానించాడు. పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదిపై తీవ్ర విమర్శలనూ గుప్పించాడు. వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో డానిష్ మాట్లాడాడు. "మనమంతా ఇక్కడ కలుసుకున్నందుకు ఆనందంగా ఉంది. పాకిస్థాన్‌లో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకోవడం బాగుంది. అక్కడ చాలా వివక్షను ఎదుర్కొన్నాం. ఇప్పుడు మన గళం విప్పుతున్నాం. నేను కూడా పాక్‌లో చాలాసార్లు వివక్షను అనుభవించా. నా కెరీర్ నాశనం అయింది. నాకు తగినట్లుగా గౌరవం పొందలేకపోయా. కారణం పాక్‌లో మైనారిటీలం కావడమే. ఇప్పుడు నేను అమెరికాలో ఉన్నా. మనం పాక్‌లో అనుభవించిన కష్టాలు ఎలాంటివో అమెరికాకు తెలియాలి. అప్పుడే ఏదొక చర్యలు తీసుకోనేందుకు ఆస్కారముంటుంది" అని కనేరియా వెల్లడించాడు.

**ఇంజామామ్ సపోర్ట్..** పాకిస్థాన్ తరఫున 61 టెస్టులు ఆడిన కనేరియా ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, షాహిద్ అఫ్రిది సారథిగా ఉన్నప్పుడు తనను మతం మారమని తరచూ ఒత్తిడి చేసేవాడని కనేరియా తెలిపాడు. " పాక్ కోసం నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించా. నాకు మద్దతుగా నిలిచిన ఏకైక కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ మాత్రమే. షోయబ్ అక్తర్, షాహిద్ అఫ్రిది సహా ఇతర ప్లేయర్లలో కొందరు తీవ్రంగా ఇబ్బంది పెట్టేవారు. కనీసం నాతో కలిసి తినేవాళ్లూ కాదు. షాహిద్ అఫ్రిది అందరికంటే ఎక్కువగా నన్ను మతం మారమని ఒత్తిడి చేసేవాడు. చాలాసార్లు అడుగుతూనే ఉండేవాడు. ఇంజమామ్ మాత్రం అలాంటి టాపిక్ కూడా తీసుకొచ్చేవాడు కాదు" అని కనేరియా వ్యాఖ్యానించాడు.


# స్టార్‌లింక్‌కు భారత్ అంత ఈజీ కాదు



శాటిలైట్ కమ్యూనికేషన్స్ సాయంతో ఇంటర్నెట్ సేవలందిం చేందుకు ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్‌ఎక్స్‌తో దేశీయ టెలికాం సంస్థలు భారతీ ఎయిర్‌టెల్, జియో ఒప్పందం చేసుకున్నాయి. స్పేస్‌ఎక్స్ అనుబంధ స్టార్‌లింక్ ఇప్పటికే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను 100 దేశాల్లో అందిస్తోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి భద్రతా పరమైన అనుమతులు లభిస్తే మన దేశంలోనూ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అయితే, స్టార్‌లింక్ సేవలకు దేశంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశీయ టెలికాం సంస్థలకు స్పెక్ట్రమ్ కేటాయించేందుకు అనుసరిస్తున్న వేలం పద్ధతినే శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థలకూ అమలు చేయాలని గతంలో ఎయిర్‌టెల్, జియో కోరాయి. కట్ చేస్తే.. ఆ రెండు సంస్థలే ప్రధాని మోదీ అమెరికా పర్యటన తరవాతి పరిణామాల్లో స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకున్నాయి. కాబట్టి భారత్‌లో స్టార్ లింక్ ఎంట్రీ మార్గం దాదాపు సుగమం అయినట్లే. స్టార్‌లింక్‌కు చెందిన 6,000 లియో (లో ఎర్త్ ఆర్బిట్) ఉపగ్రహాలు భూమికి దగ్గరగా (దాదాపు 550 కి.మీ.ఎత్తున) ఉండే కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి. భూమి నుంచి ఈ ఉపగ్రహాలు తక్కువ దూరంలో ఉండడం వల్ల తక్కువ లేటెన్సీతో ఇంటర్నెట్ సేవలను ఆస్వాదించొచ్చు. దేశంలో ఇంటర్నెట్ వినియోగదార్లు కోట్లలో ఉన్నప్పటికీ.. నెట్‌వేగం సరిగా లేని మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాలు చాలా ఉన్నాయి. అలాంటి చోట ఇంటర్నెట్ సేవలందిచేందుకు స్టార్ లింక్ ఉపయోగపడుతుంది.

అసలైన సవాళ్లు ఇవే..

- స్టార్ లింక్ అందిస్తున్న శాటిలైట్ సేవల ఏర్పాటు ఖర్చు ఎక్కువ. స్టార్ లింక్ ఇన్‌స్టలేషన్‌కు దాదాపు రూ.30,500, నెలవారీ సబ్‌స్క్రిప్షన్ సగటు రూ.10వేలు ఉంది. మన దేశంలో ఈ ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.
- స్టార్ లింక్‌లో ప్రస్తుతం డౌన్‌లోడ్ స్పీడ్ 25-220 వేగం ఉంటోంది. దేశీయంగా టెలికాం కంపెనీలు ఫైబర్, ఎయిర్‌ఫైబర్ సేవల ద్వారా 100 వేగంలో అపరిమిత డేటాను రూ.599కే అందిస్తున్నాయి.
- ఛార్జీల పరంగా చూస్తే ఫైబర్, టెలికాం టవర్లు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉండే నగరాలు, పట్టణాల్లో స్టార్ లింక్ సేవల విస్తరణకు అవకాశం తక్కువ. అంటే ఇంటర్నెట్ సేవలందించేందుకు ఏమాత్రం అవకాశం లేని కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలకు మాత్రమే స్టార్ లింక్ సేవలు పరిమితం కానున్నాయి.
- శాటిలైట్ సిగ్నళ్ల ద్వారా డేటా అందించాలంటే వాతావరణం కూడా అనుకూలించాలి. ఒకవేళ వర్షాలు, దట్టమైన మేఘాలు కమ్ముకొన్నా సిగ్నళ్లకు విఘాతం కలుగుతుంది.
- దేశంలో టెలికాం విభాగంలో జియో, ఎయిర్‌టెల్ సంస్థల హవా కొనసాగుతోంది. ఆయా సంస్థలు బ్రాడ్‌బ్యాండ్ సేవలనూ అందిస్తున్నాయి. అదీ తక్కువ ధరలో. కాబట్టి ఈ సంస్థలకు స్టార్ లింక్ ఏమాత్రం పోటీ కాబోదని నిపుణులు చెబుతున్నారు. చూడాలి భారత్‌లో స్టార్ లింక్ ఏమేర ప్రభావం చూపుతుందో.



# ఫ్రెషర్లకు గుడ్ న్యూస్..

## వచ్చే ఏడాది ఐటీలో నియామకాలు డబుల్

ఐటీ రంగంలో ఫ్రెషర్ల నియామకాలు పుంజుకొనే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి మొదలుకానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1,50,000 మందిని కంపెనీలు నియమించుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు రెట్టింపు నియామకాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని రిక్రూటింగ్ సంస్థ టీమ్‌లీజ్ తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ఐటీలో కొత్తగా నియమించుకొనే వారి సంఖ్య 85వేల నుంచి 95 వేలకు చేరే అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీని సంఖ్య దాదాపు రెట్టింపు కానుంది. ఇక యాక్సెంచర్, క్యాప్‌జెమిని, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ఐటీ సేవల సంస్థలు 1,60,000 నుంచి 1,80,000 మంది వరకు ఫ్రెషర్లను నియమించుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. 2024లో పెద్దఎత్తున ఉద్యోగాల కోతలు, నూతన నియామకాలు నెమ్మదించడం వల్ల 280 బిలియన్ డాలర్లకు పైగా ఉన్న ఔట్‌సోర్సింగ్ పరిశ్రమ సవాళ్లను ఎదుర్కొంది. ఇక 2025 ఆర్థిక సంవత్సరంలో ఫ్రెషర్ల నియామకాలు తగ్గినప్పటికీ కొంత మొత్తం ఉద్యోగుల సంఖ్య కాస్త పెరిగింది. అమెరికా అధ్యక్షుడు చేపడుతున్న సుంకాల ప్రతిపాదనలు, ఆర్థిక అనిశ్చితి విధివిధానాల కారణంగా సెంటిమెంట్ మరీ దెబ్బతింది. అయితే చాలా కంపెనీలు తమ శ్రామిక శక్తిని, ముఖ్యంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తనలో పాత్రల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ నైపుణ్యంతో తాజాగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని వచ్చే వారి నియామకాలు పెరిగే అవకాశం ఉందని టీమ్‌లీజ్ డిజిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీతి శర్మ అన్నారు.

# 200 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

## 22,400 దిగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు.. ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. హెూలీ సందర్భంగా శుక్రవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈకి సెలవు కావడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఎప్పుడేం జరుగుతోందోనన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా పొజిషన్లు తీసుకొనేందుకు ఇన్వెస్టర్లు ముందుకు రాలేదని అనలిస్టులు చెబుతున్నారు. దీంతో సెన్సెక్స్ వరుసగా ఐదో రోజు నష్టపోగా.. నిఫ్టీ సైతం 22,400 దిగువన వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిసింది. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలూ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,392.54 పాయింట్ల వద్ద (క్రితం 74,029.76) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,401 వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత అమ్మకాలతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి 200.85 పాయింట్ల నష్టంతో 73,828.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్ల నష్టంతో 22,397.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 22 పైసలు బలపడి 87గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, టాటాస్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 70 డాలర్లు, బంగారం ఔన్సు 2953 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.



# 'యుగానికి ఒక్కడు'

## 260 రోజుల షూట్.. 2వేలమంది ఆర్టిస్టులు..

యుగానికి ఒక్కడు... తెలుగు ప్రేక్షకులను విశేషంగా అలరించిన తమిళ చిత్రాల్లో ఇదీ ఒకటి. 2010లో విడుదలైన ఈ మూవీ ఇక్కడి బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అంతేకాదు, కార్తి తెలుగులో మంచి మార్కెట్ ఏర్పడటానికి బీజం వేసింది. దాదాపు 15ఏళ్ల తర్వాత మళ్లీ మార్చి 14న తెలుగులో రీ-రిలీజ్ అవుతోంది. మరి 'యుగానికి ఒక్కడు' వెనక ఉన్న ఆసక్తికర విషయాలేంటి? షూటింగ్ కోసం పడిన కష్టాలేంటి? 13వ శతాబ్దంలో పాండ్యులు, చోళుల మధ్య యుద్ధం జరుగుతుంది. చోళులు గెలిచి పాండ్యుల కులదైవం ప్రతిమను ఎత్తుకెళ్లి తమ రాజ్యంలో ఉంచి అవమానిస్తుంటారు. దీంతో పాండ్యులు ప్రతి దాడి చేస్తారు. శత్రుసేనల చేతిలో తన వంశం అంతమవకూడదని అప్పటి చోళ రాజు తన కుమారుడిని తన రాజగురువుకు అప్పగించి, వాళ్లకు రక్షణగా కొంతమంది సైనికులను పంపుతాడు. అలా పయనం మొదలు పెట్టిన రాజగురువు ద్రవిడనాడు నుంచి నేటి వియత్నాంలోని 'మిన్-గువా'కు చేరుకుంటాడు. కట్ చేస్తే, చంద్రమౌళి (ప్రతాప్ కె పోతన్) అనే పురావస్తుశాఖ ప్రొఫెసర్ చోళ యువరాజు గురించి తెలుసుకునేందుకు వెళ్లి మాయమవుతాడు. కనిపించకుండా పోయిన ప్రొఫెసర్‌ను కనిపెడతానని అనిత (రీమాసేన్), అతడి కుమార్తె లావణ్య (ఆండ్రియా)కు చెబుతుంది. తమతో పాటు, వియత్నాంకు రావచ్చని చెబుతుంది. దారిలో అవసరమైన సామాన్లు మోసేందుకు ముత్తు (కార్తి) అతడి మనుషులు కూలీలుగా వస్తారు. చోళ యువరాజు పయనించిన మార్గంలో వెళ్లిన అనిత, లావణ్య, ముత్తులకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? చోళులు సృష్టించిన ఏడు ప్రమాదాలను ఎలా దాటారు? చివరకు లావణ్య తండ్రి కనిపించాడా? ఇంతకీ 'యుగానికి ఆ ఒక్కడు' ఎవరు?అన్నది చిత్ర కథ. కథానాయికలు రీమాసేన్, ఆండ్రియాలను కేవలం 45-60 రోజుల డేట్స్ అడగ్గా, వాటిని మూడేళ్ల పాటు పెంచుకుంటూ వెళ్లారు. చోళరాజుగా నటించిన పార్తిబన్ 40 రోజుల డేట్స్ ఇవ్వగా, అవి 140 రోజులు అయింది. మొత్తం 260 రోజులకు పైగా షూటింగ్ జరిగింది. పోస్ట్-ప్రొడక్షన్ పనులే ఏడెనిమిది నెలలు పట్టాయి. దర్శకుడు సెల్వరాఘవన్ ఎడిటింగ్ టేబుల్‌పై కూర్చొన తర్వాత సినిమా నిడివి 3 గంటలా 1 నిమిషం వచ్చింది. ఎలాంటి కట్స్ లేకుండా యథాతథంగా తమిళంలో విడుదల చేశారు. సంక్రాంతి కానుకగా తమిళంలో వచ్చిన ఈ మూవీ ఫిబ్రవరిలో తెలుగులో విడుదలైంది. ఇక్కడ ఎడిట్ చేసిన వెర్షన్‌నే ప్రదర్శించారు. తొలి రోజు నుంచే మంచి టాక్‌ను తెచ్చుకుంది. సెకండాఫ్‌లో వచ్చే గుహ సన్నివేశాలను 90 రోజుల రాత్రిపూట షూట్ చేశారు. అందులో 2వేల మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. 'ఆయిరతిల్ ఒరువన్'కు సీక్వెల్ ఉంటుందని సెల్వరాఘవన్ ఇప్పటికే ప్రకటించారు. ధనుష్ కథానాయకుడిగా దీన్ని తెరకెక్కించనున్నట్లు ప్రకటించారు. కానీ, ప్రకటన మినహా దీని గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. మరి సీక్వెల్‌లో చోళ రాజగురువుగా కార్తి కనిపిస్తే చోళ యువరాజుగా ధనుష్ కనిపిస్తాడేమో చూడాలి. పాండ్యులపై ప్రతీకారం ఎలా తీర్చుకుంటాడన్నది కూడా ఆసక్తికరం.

# ప్రభాస్ అంటే ఆమాత్రం క్రేజ్ ఉంటుంది..?

## మార్చి 21న సలార్ రీరిలిజ్.. అప్పుడే బుక్ అయిపోయిన టికెట్స్



కృష్ణంరాజు నట వారసుడిగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రభాస్ తన క్రేజ్‌ని అమాంతం పెంచుకుంటున్నాడు. మధ్యలో కొన్ని ఫ్లాపులు పలకరించిన తర్వాత వరసగా హిట్స్ అందుకుంటున్నాడు. బాహుబలి సినిమాతో వరల్డ్ వైడ్ గా అభిమానులను సంపాదించుకున్న ప్రభాస్.. సలార్, కల్కి సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకొని తన సత్తా ఏంటో నిరూపించాడు. ఇక ప్రభాస్ తన తర్వాతి సినిమాల లైనప్ చూస్తే దుమ్ము రేపడం ఖాయం. ప్రస్తుతం మారుతితో రాజా సాబ్ అనే సినిమా చేస్తున్న ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డితో 'స్పిరిట్'.. సలార్ 2, కల్కి 2 చిత్రాలలో నటించనున్నారు. ఇక ప్రభాస్ నటించిన సలార్ చిత్రం ఎంత పెద్ద హిట్టైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమా భారీ యాక్షన్ డ్రామాగా రూపొంది ప్రభాస్ అభిమానులకి మంచి ఫీస్ట్ అందించింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 21న రీరిలీజ్ చేయబోతున్నారట. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. పది అంటే పది నిమిషాల్లో థియేటర్లో నాలుగు షో టికెట్స్ సేల్ కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. హైదరాబాద్ సిటీలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ థియేటర్లలో సుదర్శన్ హాలులో సలార్ చిత్రం రీరిలీజ్ అవుతుంది. ఈ థియేటర్‌లో సినిమా చూడడం ఒక అనుభూతి మాదిరిగా ఉంటుంది. అందులో ప్రభాస్ సినిమా చూస్తే ఆ థ్రిల్లే వేరు. అందుకే జనాలు సలార్ సినిమా రీరిలీజ్ చూసేందుకు ఎగబడుతున్నారు. ఈ సినిమా కలెక్షన్స్ విషయంలో సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయడం ఖాయం అంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్ రెండు పడవల మీద ప్రయాణం చేస్తున్న విషయం తెలిసిందే . ఒక వైపు మారుతి దర్శకత్వం వహిస్తున్న 'ది రాజా సాబ్' చిత్రీకరణలో పాల్గొంటూనే మరొక వైపు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఫౌజీ షూటింగ్ పూర్తి చేస్తున్నాడు. కొన్ని రోజులు ఒక సినిమా ఇంకొన్ని రోజులు వేరే సినిమా చేస్తున్నాడు. ఇవి రెండు పూర్తయ్యాక సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా చేయనున్నట్టు తెలుస్తుంది. అయితే స్పిరిట్ సినిమా చేసే సమయంలో సందీప్ పూర్తిగా ప్రభాస్‌ని లాక్ చేయనున్నాడు. ఇక ఈ మూవీ తర్వాతే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' సీక్వెల్, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ చేయనున్నాడని అంటున్నారు.

# ఎన్టీఆర్ ధరించిన గడియారం ధర ఎంతో తెలుసా..?





జూనియర్ ఎన్టీఆర్ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఒక్కో సినిమాకు వందల కోట్ల రూపాయల పారితోషికం తీసుకుంటారు. తారక్ జీవనశైలి చాలా విలాసవంతమైనది. ఎన్టీఆర్‌కు హైదరాబాద్ లో విలాసవంతమైన ఇల్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, బెంగళూరు, ముంబై, దుబాయ్ సహా అనేక ప్రదేశాలలో ఆస్తులు ఉన్నాయి. ఆయనకు లగ్జరీ కార్ల పెద్ద సేకరణ కూడా ఉంది. ఎన్టీఆర్ ధరించిన వాచ్ విలువ కోట్ల రూపాయలు. ఎన్టీఆర్ దగ్గర కోట్ల విలువైన గడియారాల సేకరణ ఉంది.అప్పుడప్పుడు ఏదో ఒక రకమైన చాలా ఖరీదైన గడియారాలను ధరిస్తారు. ప్రస్తుతం హిందీ చిత్రం 'వార్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్న నటుడు ఎన్టీఆర్ ముంబై విమానాశ్రయంలో చాలా స్టైలిష్‌గా కనిపించాడు. ఎన్టీఆర్ కొత్త లుక్ తో పాటు, ఆయన ధరించిన వాచ్ కూడా చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ ధరించిన వాచ్ ఖరీదు 7.47 కోట్ల రూపాయలు! ఎన్టీఆర్ రోల్స్ రాయిస్ కారు కంటే ఖరీదైన వాచ్ ధరించాడు. ఎన్టీఆర్ రిచర్డ్ మిల్లె 40-01 టర్బైన్ మెక్‌లారెన్ స్పీడ్‌డయల్ వాచ్ ధరించాడు. భారతదేశంలో దీని ధర 7.47 కోట్ల రూపాయలు. విదేశాల నుండి దిగుమతి చేసుకుని, అన్ని పన్నులు చెల్లించిన తర్వాత, దాని ఖర్చు 8 కోట్లు దాటుతుంది. ఈ వాచ్ చాలా అరుదు. ఈ మోడల్ వాచ్ ప్రపంచవ్యాప్తంగా 106 మాత్రమే ఉన్నాయి. వాటిలో ఒకటి జూనియర్ ఎన్టీఆర్ చేతిలో ఉంది. మెక్‌లారెన్ కారు నుండి ప్రేరణ పొందిన ఈ గడియారం ప్లాటినం, చైనాను కూడా ఉపయోగిస్తుంది. ఈ గడియారం అరుదైన యంత్రాంగాన్ని ఉపయోగించి తయారు చేయబడింది.



# కుమార్తె ఫొటోలు తొలగించడం..

## అలియా ఏమన్నారంటే

తన కుమార్తె రాహా విషయంలో బాలీవుడ్ నటి అలియాభట్ ఇటీవల ఒక కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రాహా గోప్యతకు భంగం కలగకుండా ఉండేలా.. పాపకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టా నుంచి ఆమె తొలగించారు. ఇదే విషయమై తాజాగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. పాప సంరక్షణ కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఫొటోగ్రాఫర్లు, మీడియా తన అభిప్రాయాన్ని గౌరవించాలని కోరారు. "మా ఇంట్లోకి దుండగులు చొరబడి.. రాహాను నాకు దూరంగా తీసుకువెళ్లిపోతున్నట్లు ఓసారి పీడకల వచ్చింది. అంతకంటే దారుణమైన కల మరొకటి ఉండదు. అందుకే పాప సంరక్షణ కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని నిర్ణయించుకున్నా. తన గోప్యతకు భంగం కలగకుండా ఉండేలా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాం. కాబట్టి, మా అభ్యర్థనను అర్థం చేసుకోండి. మా అనుమతి లేకుండా తన ఫొటోలు తీయొద్దు. ఒకవేళ ఎప్పుడైనా మాతోపాటు పాప ఫొటోలను తీస్తే.. తన మొహం కనిపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోగలరు. సరైన సమయం వచ్చాక ఆమెను తప్పకుండా మేమే మీ అందరి ముందుకు తీసుకువస్తాం" అని అలియా చెప్పారు. తాము ఎంత చెప్పినా వినకపోతే వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. పాప జన్మించిన తర్వాత తన జీవితం ఎంతో మారిందన్నారు. సమయానుగుణంగా తాను పరుగులు పెడుతున్నానని తెలిపారు. "పాప రాకతో నా జీవితం పరిపూర్ణమైనట్లు అనిపిస్తుంది. తను పుట్టాక నేను ఎంతో మారాను. ప్రస్తుతం నాకు రోజులు ఎంతో బిజీ బిజీగా గడుస్తున్నాయి. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ వర్క్, పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన పనులతో జీవితాన్ని గడుపుతున్నా. నా జీవితం పరుగులు పెడుతున్నట్లు అనిపిస్తుంది. రాహాతో ఉన్నప్పుడు నేను కూడా చిన్నపిల్లని అయిపోతా. అన్ని విషయాల్లో తనకు స్వేచ్ఛనిస్తుంటా" అని వెల్లడించారు. ఈ ఏడాది జరగనున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తాను పాల్గొంటున్నట్లు ఆమె చెప్పారు. ఆ కార్యక్రమం కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.



మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అందాల భామ అనుపమ పరమేశ్వరన్ వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఓ వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే .. మరో వైపు లేడీ ఓరియెంటడ్ సినిమాలతో ఆకట్టుకుంటుంది. అనుపమ పరమేశ్వరన్ ఫిబ్రవరి 1996లో కేరళలోని త్రిసూర్‌లో జన్మించారు. 2015లో అల్ఫోన్స్ పుత్రన్ దర్శకత్వం వహించిన ప్రేమమ్ చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. మొన్నటి వరకు సినిమాల్లో పద్దతిగా కనిపించిన ఈ భామ ఇటీవల గ్లామర్ గేట్లు ఎత్తేసింది. మొన్నామధ్య వచ్చిన

# అనుపమ పరదా సినిమాలో సమంత గెస్ట్‌రోల్?

టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ తన అందాలతో కవ్వించింది. సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఒకరిగా పాపులర్ అయిన అనుపమ.. ప్రస్తుతం తెలుగులో పరదా అనే చిత్రంలో నటిస్తుంది. అలాగే తమిళంలో మరిసెల్వరాజ్ దర్శకత్వంలో నటుడు ధ్రువ్ విక్రమ్ నటించిన బైసన్ సినిమాలో నటిస్తుంది. అలాగే రీసెంట్ గా అశ్వంత్ మరిముత్తు దర్శకత్వంలో నటుడు ప్రదీప్ రంగనాథన్ జోడిగా డ్రాగన్ అనే చిత్రంలో నటిస్తుంది. సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే తాజాగా అనుపమ సినిమా పరదా సినిమాలో ఓ సర్ ప్రైజ్ ఉంటుందని తెలుస్తుంది. పరదా సినిమాలో ఓ స్టార్ హీరోయిన్ కూడా నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ హీరోయిన్ ఎవరో కాదు. సౌత్ స్టార్ బ్యూటీ సమంత. ఫిలిం సర్కిల్‌లో వినిపిస్తున్న వార్తల ప్రకారం పరదా సినిమాలో సమంత ఓ కీలక పాత్రలో కనిపించనుందని అంటున్నారు.



# 'కోర్ట్' హిట్..

## 'హిట్ 3' దర్శకుడు ఆసక్తికర పోస్ట్

తాను నిర్మాతగా వ్యవహరించిన 'కోర్ట్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాని చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన విషయం తెలిసిందే. 'కోర్ట్' నచ్చకపోతే తన అప్‌కమింగ్ మూవీ 'హిట్ 3' చూడొద్దని బహిరంగంగా చెప్పారు. తాజాగా ఈ వ్యాఖ్యలను ఉద్దేశించి 'హిట్ 3' దర్శకుడు ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామ్‌జగదీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కోర్ట్'. మార్చి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా దీని పెయిడ్ ప్రీమియర్స్ ప్రదర్శించగా ఇది మంచి ప్రేక్షకాదరణతో హిట్ టాక్ సొంతం చేసుకుంది. దీంతో తన సినిమా సేఫ్ అంటూ శైలేశ్ కొలను పోస్ట్ పెట్టారు. "నా సినిమా సేఫ్ (హిట్ 3). 'కోర్ట్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలు ఉన్నాయి. ఇది కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. అందరూ చూడాల్సిన చిత్రమిది. మూవీ యూనిట్‌కు నా అభినందనలు. ప్రియదర్శి.. నువ్వు మరో విజయం సాధించావు. ఇక నా 'హిట్ 3' ఎడిట్ రూమ్‌కు వెళ్లాలి. అందరూ కోర్ట్ సినిమా చూడండి" అని పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌కు 'మిర్చి'లో ప్రభాస్ పోస్టర్‌ను జోడించారు. మిర్చిలో ప్రభాస్ 'నా ఫ్యామిలీ సేఫ్' అని డైలాగు చెప్పే ఇమేజ్‌లను శైలేశ్ కొలను పంచుకున్నారు. అంటే 'కోర్ట్'కు హిట్ టాక్ వచ్చింది కాబట్టి 'హిట్ 3' సినిమా సేఫ్ అని తన పోస్ట్‌తో వివరించారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463